RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 2 ఆగస్ట్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:56

# ఉత్తాంధ్ర అభివృద్ధికి రన్ వే





విజయనగరం, ఆగస్టు 1, పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ [illegible] అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 2 లో

## ఒక్కరోజులోనే రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



వార్తా 3 లో

## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వార్తా 3 లో

## తెలంగాణ రైజింగ్-2047'లో భాగస్వామ్యం అవ్వండి

ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి
సీఎస్ఆర్ ద్వారా కీలక పాత్ర పోషించాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపు
'సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'లో
మంత్రి శ్రీధర్ బాబు




కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) ద్వారా 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టిగా కృషి చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ది ఇన్సిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ), హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో కొండాపూర్ లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న '50వ సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 'తెలంగాణ రైజింగ్-2047' అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సాకారమయ్యే అభివృద్ధి విజన్ అని వివరించారు. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక పురోగతి సమాంతరంగా సాగేలా... ఆవిష్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేలా... అభివృద్ధి ప్రతి నియోజకవర్గానికి, దాని ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం... పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ రంగం భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సీఎస్ఆర్ ద్వారా సమాజంలో మార్పు తెచ్చే కార్యక్రమాల అమలుకు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రతి దశలోనూ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భాగస్వామిగా, సహాయకారిగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఏఐ, డేటా గవర్నెన్స్, సైబర్ భద్రత వంటి అంశాలు కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలు... కేవలం కంప్లయన్స్ నిపుణులుగా కాకుండా స్ట్రాటజిక్ బోర్డ్ అడ్వైజర్లుగా మారాల్సినఅవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు కేవలం లాభార్జనే కాకుండా... సస్టైనబుల్, ఎథికల్ వ్యాపార వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కాన్‌స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్( సీడీఎక్స్)కు నాలెడ్జ్ పార్ట్ నర్ గా ఉండేందుకు ముందుకొచ్చిన ' ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్పొరేట్ కంపెనీలు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు మహదేవ్ తిరునగరి, ఎం.దామోదరన్, శిల్పా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్లలో పూర్తి స్థాయి డిజిటలీకరణకు చర్యలు

- అక్రమాలకు తావులేకుండా మార్కెటింగ్ శాఖను పారదర్శకంగా తీర్చిదిద్దాలి
- అభివృద్ధి పనులన్నీ నిర్దేశించుకొన్న లక్ష్యం వరకు పూర్తి చేయాలి
- అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు 3 నెలల్లో పూర్తి చేయాలి
- కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణ పనులలో మాసం వారి పురోగతి నిర్దేశించుకొని ముందుకెళ్లాలి.

అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం



రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖను లక్ష్యం సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు వేగంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ పనితీరు, అభివృద్ధి పనులు, డిజిటలీకరణ, పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, ఇంజినీరింగ్ పనులు, మార్కెట్ యార్డులలో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, ప్రత్యేక బృందాల తనిఖీలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

మిగతా 3 లో

## హైడ్రా పనులతో మారిన రూపు.. నిండుకుండలా ఉప్పల్ నల్లచెరువు

భారీ వర్షాలతో పూర్తిగా నిండిపోయిన చెరువు
రూ. 20 కోట్లతో హైడ్రా చేపట్టిన అభివృద్ధి పనుల సత్ఫలితం
మురుగునీరు కలవకుండా ప్రత్యేక కాలువ నిర్మాణం
పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారుల ప్రణాళిక



హైదరాబాద్‌లోని ఉప్పల్ నల్లచెరువు నిండుకుండను తలపిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు జలకళను సంతరించుకుంది. గతంలో ఆక్రమణలు, మురుగునీటి ప్రవాహంతో కళావిహీనంగా మారిన ఈ చెరువు, హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ చర్యలతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది.
సుమారు రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో హైడ్రా అధికారులు చెరువు అభివృద్ధి పనులను చేపట్టారు. ఇందులో భాగంగా చెరువు శిఖం భూమిలోని ఆక్రమణలను తొలగించారు. పరిసర ప్రాంతాల్లో నుంచి వరద నీరు సులభంగా చెరువులోకి చేరేలా రెండు కొత్త ఇన్‌లెట్లను నిర్మించారు. అదే సమయంలో, మురుగునీరు చెరువులో కలవకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రత్యేక డైవర్షన్ కాలువను ఏర్పాటు చేశారు.
చెరువు గరిష్ట స్థాయికి చేరినప్పుడు అదనపు నీరు సాఫీగా బయటకు వెళ్లేలా ఔట్‌లెట్లను ఆధునికీకరించారు. ఈ నీరు నేరుగా మూసీ నదిలో కలిసేలా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. దీనివల్ల ఉప్పల్ ప్రాంతంలో వరద ముప్పు గణనీయంగా తగ్గనుంది. ఈ చెరువును కేవలం నీటి వనరుగానే కాకుండా, భవిష్యత్తులో ఆహ్లాదకరమైన పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రజాబలం

2 ఆగస్ట్ 2026 ఆదివారం

# ఉత్తాంధ్ర అభివృద్ధికి రన్ వే

## సీజేపీ సైలెంట్ ఉద్యమం

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది.విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు.సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020?21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం.2021?22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది.మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి.కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి.తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటున్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయిజంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి.రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దుకుంటుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.

మొదటి పేజీ తరువాయి

భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారం= చంద్రబాబు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు.ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. “రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం” అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

చేసే పనితోనే సమాధానం

ఉత్తరాంధ్రలో ప్రగతి పరుగులు పెడుతోందని వ్యాఖ్య

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితమైన చారిత్రాత్మక ఘట్టంతో ఇప్పుడు ప్రపంచం మొత్తం ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. విమానాశ్రయ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షాల హేళనలకు తమ అభివృద్ధి పనులతోనే సమాధానమిచ్చామని స్పష్టం చేశారు.ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం ఒక బలమైన సింహద్వారంలా నిలుస్తుందని, దీని ద్వారా రాబోయే రోజుల్లో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. “ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని కేవలం ఎర్రబస్సులు మాత్రమే తిరిగే వెనుకబడిన ప్రాంతం అని కొందరు అవహేళన చేశారు. కానీ ఈ రోజు కళ్లు తెరిచి చూడండి.. ఎర్రబస్సులు తిరిగిన నేలపైనే అధునాతన ఎయిర్‌బస్సులు ల్యాండ్ అయ్యే స్థాయికి ఉత్తరాంధ్ర ఎదిగిందని నిరూపించాం” అని విమర్శకులకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.దేశంలోనే ఎక్కడా లేని విధంగా అత్యంత వేగంగా ఉత్తరాంధ్రలో ప్రగతి పరుగులు పెడుతోందని వెల్లడించిన రామ్మోహన్‌నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంపై ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచం గర్వించే నాయకుడు ప్రధాని మోదీ నేతృత్వంలో 'వికసిత్ భారత్', ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో 'విజన్ 2047' లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉత్తరాంధ్ర ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

విమర్శించడం చాలా తేలిక

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని 'వికసిత్ భారత్' దిశగా వేగంగా నడిపిస్తున్నారని పవన్ కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎదుర్కొన్న విమర్శలను పవన్ గుర్తుచేసుకున్నారు. గతంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రధానిని కొందరు విమర్శిస్తున్నప్పుడు తాను చాలా బాధపడ్డానని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, వెనక్కి లాగే ప్రయత్నాలు జరిగినా మోదీ ఎక్కడా భయపడలేదని ప్రశంసించారు. మోదీ లాంటి ప్రధాని దేశానికి లభించడం అందరి అదృష్టమని, తనను దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం ఆయనదని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

ఎర్రబస్సు రాని చోటుకు ఎయిర్ పోర్టు వచ్చింది

ఎర్ర బస్సు కూడా రాని చోటుకు ఎయిర్‌బస్ అవసరమా? అని ఎగతాళి చేసిన చోటే ఇప్పుడు విమానాశ్రయం వచ్చిందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గతంలో కొందరు ఉత్తరాంధ్రను తక్కువగా చూసి, ఇక్కడి ప్రజలను అవమానించారని ఆయన విమర్శించారు. “ఎర్ర బస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది, మన ప్రధాని మోదీ వచ్చారు. ఇదే మన ఉత్తరాంధ్ర దెబ్బ, అర్థమైందా రాజా!” అంటూ ప్రత్యర్థులను ఉద్దేశించి పదునైన వ్యాఖ్యలు చేశారు.ఉత్తరాంధ్ర కలలకు ప్రధాని నరేంద్ర మోదీ రెక్కలు తొడిగారని లోకేశ్ కొనియాడారు. ప్రధాని సహకారంతోనే ఆంధ్రప్రదేశ్‌లో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన పూర్తి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. నమో అంటే.. హిమ్మత్ (ధైర్యం), విశ్వాస్ (నమ్మకం), సురక్షిత్ భారత్ (సురక్షిత భారతం) అని ఆయన వివరించారు.సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలకం కానుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ ఎయిర్‌పోర్టు రాష్ట్రానికి ఒక పవర్ ఇంజిన్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. విమానాశ్రయాన్ని వేగంగా నిర్మించిన జీఎంఆర్ సంస్థను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

బొబ్బిలి వీణ బహూకరణ

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు గవర్నర్ జస్టిస్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, అశోక్‌గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోదీ టెర్మినల్ భవనంలో కలియదిరిగి ఆధునిక సదుపాయాలను పరిశీలించారు. విమానాశ్రయం ప్రత్యేకతలు, నిర్మాణ విశేషాలను జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.మల్లికార్జునరావు, బిజినెస్ ఛైర్మన్ జీబీఎస్ రాజు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర కళావైభవానికి ప్రతీకగా నిలిచే బొబ్బిలి వీణను బహూకరించి సత్కరించారు. అంతకుముందు సభా ప్రాంగణానికి ఓపెన్ టాప్ జీపులో వస్తూ మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రధాని మోదీ వీక్షించారు. ఇటీవలే గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన థింసా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది యువతులు ప్రదర్శించిన ఈ నృత్యాన్ని చూసి ప్రధాని ఆసక్తి కనబరిచారు. ఈ క్రమంలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

## హైదరాబాద్ ప్రయాణికులకు శుభవార్త...

## త్వరలో మెట్రో రైలు, ఆర్టీసీకి ఒకే టికెట్!

### హైదరాబాద్‌లో మెట్రో, ఆర్టీసీకి ఉమ్మడి టికెట్ వ్యవస్థ ప్రతిపాదన

### ప్రయాణికుల సౌకర్యం కోసం కామన్ మొబైల్ యాప్‌పై చర్చ

### మెట్రోలో రోజువారీ, వారపు, నెలవారీ పాస్‌ల జారీకి యోచన




హైదరాబాద్ ప్రయాణికులకు ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఒకే టికెట్‌తో ప్రయాణించే వెసులుబాటును అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ అధ్యక్షతన నిన్న జరిగిన హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించారు.

ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో, ఆర్టీసీ సేవలను అనుసంధానిస్తూ 'కామన్ మొబిలిటీ టికెటింగ్' (ఒకే టికెట్ విధానం) విధానాన్ని రూపొందించాలని సీఎస్ సంజయ్ జాజూ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం టీజీఎస్ఆర్టీసీ అధికారులతో సంప్రదింపులు జరపాలని, ప్రయాణికులందరికీ ఉపయోగపడేలా ఒక ఉమ్మడి మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.అంతేకాకుండా, మెట్రో ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా రోజువారీ, వారపు, నెలవారీ ట్రావెల్ పాస్‌లను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించాలని కోరారు. మెట్రో నెట్‌వర్క్ విస్తరిస్తున్న నేపథ్యంలో, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు మెట్రో కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మెట్రో రెండో దశ (ఫేజ్-2)కు సంబంధించిన భూసేకరణ, ఇతర పనుల పురోగతిని కూడా సమీక్షించారు.

## త్వరలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్, కెనడా పర్యటన



సీఎం రేవంత్ రెడ్డి ఈ నెలలో అమెరికా (యూఎస్), కెనడా దేశాల్లో పర్యటించనున్నారని సమాచారం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సుమారు 10-15 రోజుల పాటు ఈ పర్యటన చేపట్టనున్నారని తెలిసింది. ఆయన వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ బహుళ జాతి సంస్థల ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సీఈఓలతో సమావేశమై రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ విధానాలను వివరించి పెట్టుబడులు పెట్టాలని కోరనున్నారు.

# వ్యవసాయ మార్కెట్లలో పూర్తి స్థాయి డిజిటలీకరణకు చర్యలు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలోని 206 మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు, టెండర్ ప్రక్రియలను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్ నుంచి అమలు ప్రారంభించాలని సూచించారు.

ప్రతి మార్కెట్ కమిటీలో సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, గేట్ ఎంట్రీ-ఎగ్జిట్ వ్యవస్థలను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌పై అనుసంధానం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖలో అమలవుతున్న నంబర్ ప్లేట్ స్కానింగ్ విధానాన్ని మార్కెట్ యార్డుల్లో కూడా అమలు చేసి, ప్రతి వాహనం ప్రవేశం, నిష్క్రమణ, తూకం, లావాదేవీలన్నీ డిజిటల్ రూపంలో నమోదయ్యేలా అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని ఐటీ విభాగానికి సూచించారు. ఇకపై మార్కెటింగ్ శాఖలో జరిగే అన్ని కొనుగోళ్లు పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఇటీవల ఏర్పాటు చేసిన ఏడు ప్రత్యేక తనిఖీ బృందాలు ఈ వారం నిర్వహించిన తనిఖీలపై వచ్చే సోమవారం లోగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఆ నివేదికల ఆధారంగా మార్కెటింగ్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ బృందాల పనితీరుకు వారంవారీ టైమ్‌బౌండ్ వ్యవస్థ అమలు చేయాలని స్పష్టం చేశారు.

రానున్న పత్తి కొనుగోలు సీజన్‌కు ముందుగానే సమగ్ర సన్నద్ధత అవసరమని పేర్కొన్న మంత్రి, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI), జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, సంబంధిత అధికారులతో ఆగస్టు మొదటి లేదా రెండో వారంలో సంయుక్త సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. గత రెండు సంవత్సరాల్లో విజిలెన్స్ విభాగం గుర్తించిన లోపాలను దృష్టిలో ఉంచుకొని, గతంలో జరిగిన అక్రమాలకు ఎటువంటి అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధర (మీఎా) ప్రయోజనం పూర్తిగా రైతులకే అందేలా చర్యలు చేపట్టాలని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొత్తగా కొనుగోలు చేసే ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు, లిఫ్టర్లు వంటి పరికరాలను కొనుగోలు చేసే ముందు సాంకేతిక పరీక్షలు నిర్వహించి, అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆయా పరికరాలు నిజంగా అవసరమైన జిల్లాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని, ఉపయోగం లేకుండా పరికరాలు కొనుగోలు చేసి మూలన పడేస్తే సంబంధిత కార్యదర్శి, జిల్లా మార్కెటింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మార్కెటింగ్ శాఖలో కొనసాగుతున్న ఇంజినీరింగ్ పనులన్నింటికీ స్పష్టమైన గడువులు నిర్ధారించి, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. శాఖలో ఇంజినీరింగ్ సిబ్బంది కొరత వల్ల పనులు ఆలస్యం అయితే, అవసరమైతే ఆ పనులను ఆర్ అండ్ బి (R&B), పంచాయతీరాజ్ (PR) శాఖలకు అప్పగించి వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీసీకి సూచించారు. శాఖకు కేటాయించిన ఇంజినీర్లు విధులకు హాజరుకాకపోతే వారిపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి పనికి టైమ్‌బౌండ్ కార్యాచరణ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

మార్కెట్ యార్డుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఇతర సమస్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని శాఖ కార్యదర్శిని ఆదేశించారు.

రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేయడాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. వచ్చే నెలలోగా అన్ని మార్కెట్ కమిటీల నుంచి ఫీజిబిలిటీ నివేదికలు సేకరించి, సెప్టెంబర్ నుంచి పనులు ప్రారంభించి, నవంబర్ నాటికి అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ఏజెన్సీ తయారుచేసిన డిజైన్లను వచ్చే వారంలోగా ఖరారు చేసి, ముఖ్యమంత్రి గారి అనుమతితో వచ్చే నెలలో నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

మార్కెటింగ్ శాఖలో ఇంజినీరింగ్, పరిపాలన విభాగాల్లో ఎక్కడ సిబ్బంది కొరత ఉందో వెంటనే గుర్తించి, అదనపు పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. శాఖ అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని భర్తీ చేసి, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ రోజు సచివాలయంలో వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నిర్మల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, శ్రీ శాంభరెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల గౌరవ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు మంత్రి చేపడుతున్న చర్యలను రైతు నాయకులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలు సకాలంలో అందుబాటులో ఉండేలా కంపెనీలను ఆదేశించాలని, అవసరమైన ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రిని ఆయిల్ పామ్ కంపెనీల ద్వారా తక్కువ ధరలకు సరఫరా చేయాలని కోరారు. అలాగే ఆయిల్ పామ్ తోటలలో విద్యుత్ వైర్ల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి మండలంలో కనీసం ఒక ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా ఆయిల్ పామ్ రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని, కార్మికుల కొరతను అధిగమించేందుకు యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించాలని, కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అధికారులు, కంపెనీలు, రైతులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రాంతం దేశంలోనే ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని, ఆయిల్ పామ్ అధిక ఆదాయం అందించే పంట అని, దీనికి మార్కెటింగ్ సమస్యలు లేవని, ప్రకృతి వైపరీత్యాల ప్రభావం కూడా తక్కువగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అంతర పంటల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం కూడా ఉందన్నారు. రైతులు కోరిన వెంటనే నాణ్యమైన మొక్కలను అందుబాటులో ఉంచేలా ఆయిల్ పామ్ కంపెనీలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

## తాగునీటి సమస్య వారంలోగా పరిష్కరిస్తాం..ఎమ్మెల్యే అమిలినేని

### గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తాం

### అట్టహాసంగా పండుగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ని ప్రజలకు ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని చేపట్టిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు రెండేళ్లలో నియోజకవర్గంలో 386.88 కోట్ల రూపాయలు పింఛన్ల రూపంలో అందించాం ప్రతి నెల 36,108 మందికి 16,05,41,000 రూపాయలు కూటమి ప్రభుత్వం ఇస్తోంది..రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బంది ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులు, వితంతువులకు 4000 రూపాయలకు పెంచి నాటి నుంచి నేటి వరకు అందించడం జరుగుతోందని, రెండేళ్లలో ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గానికే ప్రతి నెల 36,108 మంది లబ్ధిదారులకు 386.88 కోట్ల రూపాయలు అందించామంటే అది మా నాయకుడు మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఘనత అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబురు పేర్కొన్నారు..

నేడు కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పింఛన్లు పంపిణీ, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొనగ తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామస్థులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు..ముందుగా గ్రామంలోని భక్త కనకదాసు, ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబెడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.గ్రామానికి వచ్చే రహదారి సైతం దెబ్బతిందని గ్రామస్థులు చెప్పగా తప్పకుండా రాబోయే రోజుల్లో రోడ్డు నిర్మిస్తామని తెలిపారు..ప్రతి నెల మన నియోజకవర్గ వ్యాప్తంగా 36,108 మంది లబ్ధిదారులకు పింఛన్లు 16,05,41,000 రూపాయలు అందిస్తున్నామని, ఇప్పటి వరకు రెండేళ్లలో 386.88 కోట్ల రూపాయలు అందించామని పేర్కొన్నారు..మన ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారు దేశ, విదేశాలు తిరిగి మన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని, దాంతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తోందని, ఈ రెండు ఏళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లితుంటే ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారని, వర్షాలు లేక భూగర్భజలాలు తగ్గిపోవడం వలన తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

### అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
### పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
### నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు
### భూముల ధరల సవరణతో స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ల ఆదాయం 20% వరకు పెరుగుదల
### త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం
### కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లులు చెల్లిస్తాం
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: - ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు.

శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు.

తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు.

ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు.

రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

క్యూర్ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఫైనల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు.

భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ & రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## ఒక్కరోజులోనే రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

### తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు
### దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్
### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆన్లైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం (31/07/2026) ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మీసేవ డిజిటల్ ప్లాట్ ఫామ్ ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు. ప్రతీ రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

ఈ ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు.మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్నాయి.అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## కామన్వెల్త్ క్రీడల్లో భారత్ కు మరో రెండు బంగారు పతకాలు

న్యూ ఢిల్లీ కామన్ వెల్త్ క్రీడల్లో భారత్ కు మరో రెండుబంగారు పతకాలు లభించాయి. మహిళల బాక్సింగ్ లో ప్రీతి పవార్ కు గోల్ మెడల్ దక్కింది. 54 కేజీల బాక్సింగ్ విభాగంలో ప్రీతి పవార్ కు స్వర్ణం లభించింది. పారా షాట్ పుట్ కు సోమన్ రానాకు కుడా బంగారు పతకం లభించింది. 13.40 మీటర్లు దూరం రానా విసిరాడు. ఇప్పటివరకు భారత్ ఖాతాలో 25 పతకాలు దక్కాయి.

## మనవరాలైన మైనర్ బాలికపై తాత అత్యాచారం

ములుగు జిల్లా వాజేడు మండలంలో అమానుష ఘటన వెలుగు చూసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. తలుపులు వేసి 14 ఏళ్ల బాలికపై తాత మోడెం కృష్ణయ్య అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించి.. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే అనారోగ్యానికి గురవ్వగా, నానమ్మ బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లింది. బాలిక గర్భం దాల్చిందని వైద్యులు చెప్పగా, బాలికను నిలదీసింది నానమ్మ. తాతయ్యే ఇలా చేశాడని మైనర్ బాలిక చెప్పడంతో.. కృష్ణయ్యను కుటుంబ సభ్యులు నిలదీసారు. అబార్షన్ చేపించి, పెళ్లి అయ్యేవరకు ఖర్చులు భరిస్తానని కృష్ణయ్య భరోసా ఇచ్చాడని బాలిక ఆరోపించింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వస్తున్నాయి.

# రంగంలోకి రోజా



తిరుపతి, ఆగస్టు 1, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక కొత్త పరిణామం పార్టీ శ్రేణులకు గందరగోళపరుస్తోంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ఒక కుదుపు. మాజీ మంత్రి ఆర్కే రోజా మళ్లీ యాక్టివ్ కావడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. ఆమె సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఆమెను పక్కనపెట్టి బీసీ నేతకు అవకాశం ఇస్తారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. ఈ విషయంపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు. నగిరి నియోజకవర్గంలో రోజా అభ్యర్థిత్వం మార్చు చేయాలని ఆయన కోరుతూ వచ్చారు. ఎందుకంటే రోజా ఉంటే పెద్దిరెడ్డికి ఇబ్బందికరమే. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీనియర్ మంత్రిగా పెద్దిరెడ్డి ఉంటారు. అదే జిల్లాలో రోజా మంత్రిగా ఉంటే తనకు ఇబ్బందికరమని పెద్దిరెడ్డికి తెలుసు. అందుకే మొన్నటి ఎన్నికల్లో రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు పెద్దిరెడ్డి. కానీ జగన్ చివరి నిమిషంలో ఆమెకు చాన్స్ ఇచ్చారు. ఈసారి ఆమెను తప్పిస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. కానీ ఇప్పుడు రోజాను మళ్ళీ తెరపైకి తేవడంతో పెద్దిరెడ్డి తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది.ఇటీవల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి బిజెపిలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దానికి కారణం లేకపోలేదు. జగన్ స్థాయిలో పెద్దిరెడ్డి ఫ్యామిలీని టార్గెట్ చేసుకుంది కూటమి ప్రభుత్వం. అయితే ఇంతవరకు జగన్మోహన్ రెడ్డిని టచ్ చేయలేదు కానీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు మద్యం కుంభకోణంలో. అయితే ఈ పరిణామాలతో తీవ్ర కలత చెందారు పెద్దిరెడ్డి. మరోవైపు మద్యం కుంభకోణంలో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న సమయంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కనీసం జగన్మోహన్ రెడ్డి పరామర్శించిన దాఖలాలు లేవు. అప్పటినుంచి ఏర్పడిన గ్యాప్ అలానే విస్తరించింది. ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై అటవీ భూముల వ్యవహారం, ఆపై రెవెన్యూ రికార్డుల దహనం కేసు వెంటాడుతోంది. ఇన్ని అవమానాలు పడి జగన్మోహన్ రెడ్డి కోసం పార్టీలో ఉండాలా.. ఆపై తన ప్రత్యర్థి రోజాను ప్రోత్సహించడం ఎంత మాత్రం మింగుడు పడడం లేదు పెద్దిరెడ్డికి. అందుకే బిజెపిలోకి వెళ్లిపోవాలన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు రోజా. ఆమెకు నగిరి టిక్కెట్ ఇచ్చేందుకు జగన్ వెనుకడుగు వేస్తున్నారు అన్న ప్రచారం నేపథ్యంలోనే ఆమె చెన్నైలో ఉండిపోయారన్న టాక్ నడిచింది.. క్రమేపీ ఆమె వైసీపీకి గుడ్ బై చెబుతారని కూడా ప్రచారం సాగింది. కానీ ఉన్నట్టుండి ఆమెను తిరిగి చిత్తూరు రాజకీయాల్లోకి తేవడం.. మరింత స్వేచ్ఛ ఇవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. పెద్దిరెడ్డి పై ప్రోత్సహించేందుకే జగన్ ఆమెను తీసుకొచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఒకవేళ బిజెపిలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ వెళితే రోజా ఇప్పుడు ప్రత్యామ్నాయంగా చిత్తూరు జిల్లాలో నాయకత్వ బాధ్యతలు చూస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వడివడిగా హైకోర్టు బెంచ్ ఏర్పాట్లు

కర్నూలు, ఆగస్టు 1, రాయలసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్ష అయిన కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన తీవ్ర ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. 90 రోజుల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్ అందుబాటులోకి వస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, ఒక రాష్ట్రంలో లేదా ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం అనేది కేవలం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోని అంశం మాత్రమే కాదు. దీనికి సుదీర్ఘమైన రాజ్యాంగపరమైన, న్యాయపరమైన, పరిపాలనాపరమైన ప్రక్రియలు అవసరమవుతాయి. అందుకే 90 రోజుల గడువు సాధ్యమేనా? అసలు బెంచ్ ఏర్పాటు వెనుక ఉండే చట్టపరమైన క్రమం ఏమిటి? సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో హైకోర్టుకు చెందిన ఒక ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలంటే ది స్టేట్ హైకోర్ట్స్ యాక్ట్ లేదా సంబంధిత పునర్వ్యవస్థీకరణ చట్టాల నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొదట రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించాలి. అనంతరం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలోని ఫుల్ కోర్ట్ ముందుకు ఈ ప్రతిపాదన వెళుతుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ ఈ బెంచ్ ఏర్పాటుకు సాంకేతిక, మౌలిక వసతుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి పూర్తి స్థాయిలో ఆమోదం తెలపాల్సి ఉంటుంది.హైకోర్టు ఫుల్ కోర్ట్ అంగీకారం తెలిపిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కేంద్ర న్యాయ శాఖ కు నివేదిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి , సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలనకు పంపుతుంది. సుప్రీంకోర్టు సీజేఐ , కొలీజియం నుండి అనుమతి లభించిన తర్వాత మాత్రమే, కేంద్ర హోంశాఖ భారత రాష్ట్రపతి ఆమోదం కోసం ఫైలును పంపుతుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 214, సంబంధిత నిబంధనల ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చట్టబద్ధంగా రూపుదిద్దుకుంటుందిరాజ్యాంగపరమైన ఈ ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన అత్యంత ప్రధానమైనది. బెంచ్ నిర్వహణకు అవసరమైన తాత్కాలిక లేదా శాశ్వత భవనాలు, న్యాయమూర్తులకు నివాస సదుపాయాలు , కోర్టు హాళ్లు, రిజిస్ట్రీ సెక్షన్లు, అడ్వకేట్ రూమ్‌లు, పోలీస్ బందోబస్తు , డిజిటల్ నెట్‌వర్కింగ్ వంటి మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయాలి. వీటితో పాటు అమరావతిలోని ప్రధాన హైకోర్టు నుండి కర్నూలు బెంచ్‌కు ఏ ఏ జిల్లాల కేసుల అధికార పరిధి బదిలీ చేయాలనే దానిపై న్యాయ పరిపాలనా పరమైన స్పష్టత రావాల్సి ఉంటుందిఇంతటి సుదీర్ఘ ప్రక్రియ ఉన్నప్పటికీ మంత్రి నారా లోకేష్ 90 రోజుల గడువు విధించడం వెనుక కూటమి ప్రభుత్వ వ్యూహాత్మక ఆలోచన ఉందని రాజకీయ, న్యాయ విశ్లేషకులు భావిస్తున్నారు. కర్నూలులో ఇప్పటికే లోకాయుక్త వంటి న్యాయ సంస్థలకు ఉద్దేశించిన భవనాలు సిద్ధంగా ఉన్నందున, ప్రాథమికంగా తాత్కాలిక భవనంలో బెంచ్ కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటును ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రంతో మంచి సఖ్యతతో ఉన్నందున, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం త్వరితగతిన పూర్తి చేసి, సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేల అనుమతుల ప్రక్రియను ఫాస్ట్ ట్రాక్ చేయాలనేది లోకేష్ వేసిన కచ్చితమైన ముందస్తు ప్రణాళికగా కనిపిస్తోంది. గతంలో బెంచ్ ఏర్పాటు ప్రక్రియలపై న్యాయవాదుల నిరసనలు, వినతులు జాప్యానికి కారణమైన ఆధారాలు ఉన్నాయి. అందువల్ల, 90 రోజుల్లో అన్ని రాజ్యాంగ ఆమోదాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు పొందడం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో పరిపాలనాపరమైన క్లియరెన్సులను వేగవంతం చేస్తే, నిర్ణీత సమయంలో లేదా దానికి సమీప కాలంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ కల సాకారమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# భువనేశ్వరి ఆగ్రహం...



తిరుపతి, ఆగస్టు1 నారా భువనేశ్వరి గత మూడు రోజుల నుంచి కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అయితే నారా భువనేశ్వరి ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడరు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు దాదాపు నాలుగు సార్లు ఎన్నికయినప్పటికీ నారా భువనేశ్వరి పాలన వ్యవహారాల్లోనూ, రాజకీయాల్లోనూ ఆమె జోక్యం కనపడదు. కేవలం కుటుంబ బాధ్యతలతో పాటు తాను నిర్వహిస్తున్న హెరిటేజ్ వంటి పరిశ్రమలకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే చూస్తున్నారు. నారా భువనేశ్వరి పక్కా బిజినెస్ ఉమెన్. అయితే ఎన్నికల సమయంలో మాత్రం కేవలం కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారు. అంతే తప్ప ఎటువంటి రాజకీయ వ్యవహారాలను నారా భువనేశ్వరి పట్టించుకోరు... నారా భువనేశ్వరిలో కోపం కనిపించదు. మృదుస్వభావి. అందరినీ నవ్వుతూ పలకరిస్తారు. అమ్మగా ఆమెను ఆప్యాయతను పంచుతారు. అలా చంద్రబాబుతో సమానంగా కుప్పం నియోజకవర్గ ప్రజలకు చేరువయ్యారు. నారా భువనేశ్వరి మాత్రమే కాదు లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి కూడా రాజకీయాలను అస్సలు పట్టించుకోరు. వారు కుటుంబం, వ్యాపారాలకే పరిమితమై హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అలాంటి నారా భువనేశ్వరి కి కోపం వచ్చింది. ఒక్కసారిగా ఆవేదన ఉప్పొంగింది. కుప్పం నియోజకవర్గం పర్యటనలో ద్రౌపది చిత్రపటాన్ని చూసి నారా భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. కుప్పం పర్యటనలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నారా భువనేశ్వరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనను అసెంబ్లీలో అవమానించారని... అసెంబ్లీలో తనను నిండు సభలో అవమానించారని, ఆ సంఘటన మహాభారతంలో ద్రౌపది వస్త్రాపహరణాన్ని తలపించిందని కంటతడి పెట్టుకున్నారు. కౌరవులు సభలో ద్రౌపదిని అవమానించినట్టుగానే, గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం తన చరితను హేళన చేశారని మండిపడ్డారు. తన భర్తకు తానేంటో తెలుసునని, తన భర్త చంద్రబాబుకు బాగా తెలుసునని , ఏ మహిళపై వ్యక్తిగత విమర్శలు చేసే హక్కు ఎవరికీ లేదని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. రాజకీయాల్లో పోరాటాలు ఎవరిపై చేయాలన్నా చేసుకోవచ్చు కానీ, ఇళ్లలోని స్త్రీలను లాగి అవమానించడం అత్యంత హేయమని ఆవేదన వెలిబుచ్చారు. మగ అహంకారంతో గత ప్రభుత్వంలో వ్యవహరించి తనను హేళన చేయడాన్ని ఆమె గుర్తు చేసుకుని బాధపడ్డారు. ఇది రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది.

# లక్ష్యాల అమలులో నిర్లక్ష్యం సహించం.

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు, మహిళా సంఘాల ఆర్థిక సాధికారతపై ప్రత్యేక దృష్టి**

**సెర్ప్ కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్ష.**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు01 ప్రజాబలం:**జిల్లాలో సెర్ప్ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేసి, స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలని,



లక్ష్యాల అమలులో నిర్లక్ష్యం సహించమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు.

శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సెర్ప్ కార్యక్రమాల అమలు, వీఓ భవనాల నిర్మాణం, బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు, పీఎంఎఫ్ఎంఈ యూనిట్లు తదితర అంశాల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వీఓ భవనాల ప్రతిపాదనలు పంపే సమయంలో స్థల వివాదాలు లేని ప్రాంతాలనే ఎంపిక చేయాలని, వీఓ భవనాలకు స్థలాలను ప్రతిపాదించే ముందు రెండు, మూడు సార్లు క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి మాత్రమే పంపించాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి నెల ఎంతమంది స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలకు అర్హులవుతున్నారో ముందస్తు ప్రణాళికతో గుర్తించి, లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా నెలవారీ లక్ష్యాలను నిర్ధారించి, బ్యాంకు లింకేజీపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

రుణాలు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) శాతాన్ని తగ్గించేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఎర్రుపాలెంతో పాటు ఇతర ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని ఎన్‌వోసీలు, అనుమతులు త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ వీఓ భవనాల స్థల సమస్యలను పరిష్కరించేందుకు వచ్చే శుక్రవారం నాటికి ప్రత్యామ్నాయ స్థలాల ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు లింకేజీ లక్ష్యం ఇప్పటి వరకు 12 శాతం మేర సాధించామని, ఇది రాష్ట్ర సగటుతో సమానమని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్‌పీఏ 1.68 శాతంగా ఉందని, దీనిని మరింత తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఈ సమావేశంలో డిఆర్డిఓ శ్రీరామ్, అడిషనల్ డిఆర్డిఓ, డీపీఎంలు, ఏపీఎంలు, సెర్ప్, డిఆర్డిఏ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఫుల్ రేంజ్ లో లోకేష్ పాలిటిక్స్



విజయవాడ, ఆగస్టు 1, మంత్రి నారా లోకేష్.. ఫుల్ రేంజ్‌లో తన రాజకీయాలను విస్తరిస్తున్నారు. ఇటీవల కాలంలో పార్టీపై ఆయ న పట్టు పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్ అవుతున్నాయి. నియోజకవర్గాలు, జిల్లాలు.. ఇలా ఎక్కడ ఎప్పుడు ఏది అవసరమో గుర్తించి.. దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఒకవైపు పాలన చూసుకుంటూ.. మరోవైపు.. పార్టీ పనుల్లోనూ బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా కర్నూల్లో నిర్వహించిన సమావేశం లోకేష్ దూకుడుకు పక్కా రియాక్షన్ ఇచ్చింది.=పార్టీ కార్యక్రమాలకు ఇటీవల కాలంలో దూరంగా ఉంటూ వచ్చిన వారు కూడా.. తాజాగా లోకేష్ వస్తున్నారని తెలిసిన వెంటనే నాయకులు క్యూకట్టారు. అప్పటి వరకు ఉన్న విభేదాలను కూడా కొందరు నాయకులు దూరం పెట్టి చేతులు కలిపారు. లోకేష్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భేషజాలకు పోకుండా చేతు లు కలిపారు. ఇది.. పార్టీలో ఐక్యతకు నిదర్శనంగా మారిందని సీనియర్లు చెబుతున్నారు. నిజానికి కొన్నాళ్లుగా కర్నూలు తమ్ముళ్ల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ం. నిజానికి టీడీపీలో తరం మారుతున్న సంధికాలంలో నాయకుల పరిస్థితి.. అధిష్టానం ఆలోచనలు వంటివి ప్రత్యేకంగా చర్చకు వస్తున్నాయి. చంద్రబాబుకు లోకేష్‌కు మధ్య వ్యత్యాసం.. దూకుడు వంటివి నాయకుల మధ్య ఆలోచనలను మారుస్తున్నాయి. చంద్రబాబు అయితే.. చెప్పింది వింటారు.. బుజ్జగిస్తారు.. సమయం ఇస్తారు.. అనే భరోసా ఉంటుంది. దీంతో తప్పులు చేసిన నాయకులు కూడా వివరణ, విచారణలతో ఏదో ఒకరకంగా బయట పడుతున్నారు.కానీ, లోకేష్ విషయానికి వస్తే.. ఆయన దగ్గర ఇలాంటి కుదరడం లేదు. దీనికి అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. మైలవరం నుంచి పెనమలూరు వరకు.. పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న వివాదాలను లోకేష్ తనదైన శైలిలో పరిష్కరించారు. ఆయనేమీ సాగదీత ధోరణికి చాన్స్ ఇవ్వరు. ఫటాఫట్.. అన్నట్టు గా నాయకులతో మొహంమీదే మాట్లాడేస్తున్నారు. దీంతో నాయకుల మధ్య ఐక్యత పెంచేందుకు.. పార్టీని లైన్‌లో పెట్టేందుకు ఈ పరిణామాలు దోహదపడుతున్నాయి. ఇదే ఇప్పుడు కర్నూలులో నాయకులు తిరిగి కలుసుకునేందుకు అవకాశం కల్పించిందని అంటున్నారు.

# వీర మహిళలకు పెద్ద పీట....

కాకినాడ, ఆగస్టు 1, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు.

# వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..

విజయవాడ, ఆగస్టు 1, వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహును ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నివేదికలను కపిల్ సాహు టీం జగన్ కు అందిస్తున్నట్లు సమాచారం. అందుకే జగన్ ఈసారి ఎన్నికల్లో తమదే గెలుపు అన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. కపిల్ సాహు టీం ఇప్పటికే ఏపీ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని అంటున్నారు. జగన్ ఎక్కడకు వెళ్లినా విపరీతమైన జనం రావడం, టూర్ ఆలస్యమవ్వడం వ్యూహకర్త వ్యూహంలో భాగమేనని అంటున్నారు. అయితే ఈ పేరు అధికారికంగా బయటకు రాకపోయినా అనధికారికంగా కపిల్ సాహు డ్యూటీలోకి దిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. టీవీకే అధినేత విజయ్ ఎన్నికల వ్యూహకర్త గా కపిల్ సాహు వ్యవహరించారు. ఆయన ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బృందంలో పనిచేసి, ఆ తర్వాత సొంతంగా 'పొలిటికల్ కన్సల్టింగ్ డొమైన్' అనే సంస్థను ఏర్పాటు చేసి విజయ్ పార్టీ టీవీకే విజయం కోసం పనిచేశారు. తొలిసారి విజయ్ ను ముఖ్యమంత్రి పీఠం పై కూర్చోబెట్టడంలో కపిల్ సాహు కీలకంగా వ్యవహరించారు. తక్కువ సీట్లు వచ్చినప్పటికీ కపిల్ సాహు టీం సోషల్ మీడియాలో డ్రైవ్ చేయడం, విజయ్ కు అనుకూలంగా మార్చడంలో సక్సెస్ అయ్యారు. ఇదే విషయాన్ని వైసీపీ అధినేత జగన్ గుర్తించి ఆయనను తనకు 2029 ఎన్నికల వ్యూహకర్తగా ఉండాలని కోరినట్లు తెలిసింది. దీంతోకపిల్ సాహు ఇందుకు అంగీకరించినట్లు తెలసింది. ఇప్పటికే కపిల్ సాహు టీం జగన్ వ్యవహారాలను పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతతిన్నాయి. ప్రశాంత్ కిషోర్ సంస్థ ఐ ప్యాక్ లో పనిచేసిన అనుభవంతో,డాటా విశ్లేషణ, ప్రచార ప్రణాళికలు రూపొందించడంలో కపిల్ సాహు టీంకు మంచి పేరు ఉండటంతో జగన్ దృష్టిలో పడ్డారు. తనకు ప్రధాన మీడియా వ్యతిరేకం కావడం, డిజిటల్ ప్రచారంపై ఎక్కువగా ఆధారపడి రావాల్సి ఉండటంతో జగన్ కపిల్ సాహును ఎన్నికల వ్యూహకర్తగా ఎంచుకున్నారంటునరారు. తాను నేరుగా ఎక్కువ మీడియా సమావేశాల్లో పాల్గొనకపోయినా, సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి వెళ్లేలా పటిష్టమైన వ్యూహాన్ని అమలు చేయడం, సంక్షోభ సమయాల్లో సమన్వయం, ప్రచార సరళిని నిర్వర్తించడంలో కపిల్ సాహు బృందం కీలక పాత్ర పోషించనుందని చెబుతున్నారు. మరి కపిల్ సాహు ఎంత మేరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# ధవళేశ్వరం వద్ద గోదావరికి వరద పోటు

రాజమండ్రి ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్దకు ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరదనీటి ప్రవాహంతో పాటు సీలేరు వరద జలాలు తోడవడంతో గోదావరి నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువైంది. శనివారం ఉదయం 6 గంటకు 10.60 అడుగులకు చేరింది. దీంతో ఇరిగేషన్ అధికారులు 175 గేట్లను కొద్ది మేర ఎత్తి 8,25,315 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూడు ప్రధాన పంట కాలువలు ద్వారా 1100 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేసారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్దకు వరద నీరు చేరడంతో జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరిలోకి ఎవరిని దిగవద్దంటూ హెచ్చరిస్తున్నారు.

# భర్త బెట్టింగ్ వ్యసనం..
# సాఫ్ట్వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



కుప్పం నెల్లూరు జిల్లా చేజర్ల మండలం ఆదూరుపల్లికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజినీర్ చీరల రాధ గురువారం అర్ధరాత్రి కుప్పం రైల్వే స్టేషన్లో విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న ఆమె భర్త బెట్టింగ్కు బానిసై రూ.లక్షలు నష్టపోవడంతో కుటుంబంలో తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పులు తీర్చేందుకు పుట్టింటివారు రూ.40 లక్షలు సాయం చేసినా భర్తలో మార్పు రాలేదు. దీంతో సమస్యను పెద్దలతో చర్చించేందుకు బెంగళూరు నుంచి వస్తున్న సమయంలో ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంది. ఆమె బ్యాగులో సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు

# భారత్ కు జిన్ పింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు1, 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్?చైనా సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లపాటు భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాకు వెళ్లలేదు. చైనా అధ్యక్షుడు జిన్పింగ్ భారత్ను సందర్శించలేదు. ఇటీవలే భారత్?చైనా సంబంధాలు మళ్లీ పునరుద్ధరణ జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ కొన్ని నెలల క్రితం చైనా పర్యటనకు వెళ్లారు. ఇక ఇప్పుడు సెప్టెంబర్ 12?13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్కు జిన్పింగ్ హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మరింత తగ్గించి, కొత్త సంబంధాల పునాది వేసే అవకాశంగా ఉంది.గల్వాన్ ఘర్షణ తర్వాత సరిహద్దు ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, వాణిజ్య పరిమితులు వంటివి రెండు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 2019లో మామల్లపురంలో జరిగిన అనధికారిక సమ్మిట్ తర్వాత జిన్పింగ్ భారత్కు రాలేదు. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. 2024లో కజాన్లోనూ, 2025లో తియాన్జిన్లోనూ ప్రధాని మోదీ, జిన్పింగ్ కలుసుకున్నారు. సరిహద్దు విషయంలో కొన్ని అవగాహనలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిన్పింగ్ రాక భారత్?చైనా సంబంధాల్లో మరో ముఖ్యమైన మలుపుగా మారే అవకాశం ఉంది.భారత్ బ్రిక్స్కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కూడా ముఖ్యమైనది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంక్షోభం, గ్లోబల్ సౌత్ సమస్యలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ఉంటాయి. జిన్పింగ్ హాజరైతే ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. సరిహద్దు సమస్యలు, వాణిజ్య అసమతుల్యత, పెట్టుబడులు వంటి అంశాలపై చర్చ జరగవచ్చు.ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య నమ్మకం పెరిగే అవకాశం ఉంది. వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం, సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తగ్గడం, బహుపక్ష వేదికల్లో సహకారం పెరగడం వంటి ఫలితాలు రావచ్చు. అయితే సరిహద్దు విషయంలో ఇంకా పూర్తి పరిష్కారం లేకపోవడం, పరస్పర అపనమ్మకం, ప్రాంతీయ రాజకీయాలు వంటివి సవాళ్లుగా ఉంటాయి. అయితే జిన్పింగ్ పర్యటనపై? అధికారిక ప్రకటన ఇంకా రాలేదుగల్వాన్ ఘటన తర్వాత తొలిసారి జిన్పింగ్ భారత్కు రావడం రెండు పెద్ద ఆసియా శక్తుల మధ్య సంబంధాలను కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక దీనికి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అయితే నిజమైన పురోగతి సరిహద్దు, వాణిజ్య సమస్యలపై కాంక్రీట్ చర్యలపైనే ఆధారపడి ఉంటుంది.

# అజిత్ దోవల్కు లోకమాన్య తిలక్ అవార్డు

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లోక్మాన్య తిలక్ జాతీయ అవార్డును అందజేశారు. పుణెలో బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం, బోర్డర్ సెక్యూరిటీకి దోవల్ చేసిన సేవలకు గాను ఈ అవార్డును అందించారు. ఈ అవార్డులో మెమొంటో, ప్రశంసా పత్రం, లక్ష నగదు బహుమతి ఉంటాయి. దోవల్ ఇంటెలిజెన్స్, నేషనల్ సెక్యూరిటీ రంగాల్లో సుదీర్ఘ అనుభవం కలిగి ఉన్నారు.

### పీలేరులో కారు బీభత్సం..
### వాహనాలను ఢీకొట్టి డ్రైవర్ పరార్

పీలేరులో అజంతామిట్ట వద్ద శనివారం తెల్లవారుజామున ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో ఉన్నట్లు అనుమానిస్తున్న డ్రైవర్ నిలిపి ఉన్న రెండు స్కూటీలు, ఒక కారును ఢీకొట్టి అనంతరం గోడను ఢీకొన్నాడు. తర్వాత కారును అక్కడే వదిలి నంబర్ ప్లేట్ తొలగించి పరారయ్యాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కారును అడ్వకేట్ శివదిగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మూవీస్ లోకి తేజస్విని ఎంట్రీ
# మోక్షజ్ఞ కంటే ముందే



హైదరాబాద్, ఆగస్టు1, గాడ్ ఆఫ్ మాసెస్ బాలయ్య చిన్న కూతురు తేజస్విని గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. తన డ్యాన్స్తో ఫుల్ ఫేమ్ సంపాదించుకున్నారు. గతంలో ఓ పాటకు డ్యాన్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా సూపర్ క్రేజ్ వచ్చింది. రీసెంట్గా నాగ చైతన్య లవ్ స్టోరీ మూవీలో 'సారంగ దరియా' పాటకు అద్భుతమైన స్టెప్పులేశారు. ఫుల్ ఎనర్జీతో ప్రొఫెషనల్ డ్యాన్సర్ తరహాలో ఆమె చేసిన డ్యాన్స్ వైరల్ అయ్యింది. ఇప్పుడు తేజస్విని మూవీల్లోకి ఎంట్రీ ఇస్తారనే ప్రచారం ఫిలింనగర్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఆమె ఎంట్రీ ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. స్పోర్ట్స్ డ్రామా స్టోరీ బ్యాక్ డ్రాప్లో బాలయ్య కుమార్తె ప్రధాన పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కథా చర్చలు సాగుతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టును ఎవరి నిర్మించేది? పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడయ్యే ఛాన్స్ ఉందని అంటున్నారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలా కాకుండా... ఓ సందేశాత్మక చిత్రంగా దీన్ని రూపొందించేలా ప్లాన్ చేస్తున్నారట.అయితే, ఈ ప్రచారంపై అటు బాలయ్య కానీ, ఇటు తేజస్విని కానీ ఎవరూ రియాక్ట్ కాలేదు. ఇటీవలే తేజస్విని ఓ గోల్డ్ జ్యువెలరీ బ్రాండ్కు అంబాసిడర్గా వ్యవహరించారు. అప్పుడే మూవీల్లోకి ఎంట్రీపై పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఆ తర్వాత తన డ్యాన్స్ వీడియోలతో సోషల్ మీడియాలో సందడి చేశారు. దీంతో ఆ ప్రచారానికి మరింత బలం చేకూరింది. నందమూరి ఇంటి నుంచి మరో వారసురాలు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారన్న ప్రచారంపై ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోక్షజ్ఞ కంటే ముందే

ఓ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో రూపొందనున్న చిత్రంలో తేజస్విని ప్రధాన పాత్రలో నటించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. రెగ్యులర్ కమర్షియల్ సినిమా కాకుండా, క్రీడా నేపథ్యంతో పాటు బలమైన సందేశం ఉండేలా ఈ చిత్రాన్ని రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయట.ఇటీవలి కాలంలో తేజస్విని సోషల్ మీడియాలో చాలా యాక్టివ్గా ఉంటున్నారు. డ్యాన్స్ రీల్స్, బ్రాండ్ ప్రమోషన్లు, ప్రకటనల్లో కనిపిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ చూసిన అభిమానులు కూడా "సినిమాల్లోకి వస్తే బాగుంటుంది" అనే అభిప్రాయాన్ని చాలాకాలంగా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు అదే దిశగా అడుగులు పడుతున్నాయని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.ఈ వార్తలో మరో ఆసక్తికరమైన కోణం కూడా ఉంది. నందమూరి అభిమానులు ఎన్నాళ్లుగానో మోక్షజ్ఞ సినీ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే పరిస్థితులు చూస్తుంటే మోక్షజ్ఞ పూర్తి స్థాయి హీరోగా ప్రేక్షకుల ముందుకు రావడానికి ముందే తేజస్విని వెండితెరపై కనిపించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే, నందమూరి కుటుంబం నుంచి మోక్షజ్ఞ కంటే ముందుగా తేజస్వినే సినీ అరంగేట్రం చేసిన సభ్యురాలిగా నిలుస్తారు.అయితే ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. చర్చలు విజయవంతంగా పూర్తయితే త్వరలోనే చిత్రబృందం ఈ సినిమాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# లక్ష కోట్లతో పీపీపీలు... నెంబర్ వన్

విజయవాడ, ఆగస్టు 1, భారతదేశంలో మౌలిక వసతుల విప్లవాత్మక అభివృద్ధి కోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ ప్రాజెక్టుల పైప్లైన్లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం రాష్ట్రాల వారీగా పిలిచిన ప్రతిపాదిత పీపీపీ ప్రాజెక్టుల విలువ, సంఖ్య పరంగా ఏపీ అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రంలో ఏకంగా రూ. 1,15,578.81 కోట్ల అంచనా వ్యయంతో 270 మౌలిక వసతుల ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం తన నివేదికలో స్పష్టం చేసింది.దేశవ్యాప్తంగా మొత్తం రూ. 17 లక్షల కోట్లకు పైగా విలువైన 852 ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తెచ్చి, ప్రైవేట్ పెట్టుబడిదారులకు స్పష్టమైన రోడ్మ్యాప్ను అందించింది. ఈ జాబితాలో తమిళనాడు రూ. 87,639.65 కోట్ల విలువైన 70 ప్రాజెక్టులతో రెండో స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రూ. 65,496.50 కోట్లతో 21 ప్రాజెక్టులతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. అన్ని ర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ చాలా ముందంజలో ఉంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికాభివృద్ధి, రోడ్లు, పోర్టులు, ఇంధన రంగం మరియు పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై దృష్టి సారించింది. పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేసి కేంద్ర సమ్మతిని పొందింది. రహదారులు, ఓడరేవులు, లాజిస్టిక్ పార్కులు, ఇంధన రంగానికి చెందిన కీలక ప్రాజెక్టులను ఈ 270 ప్రతిపాదనల్లో పొందుపరిచారు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ అధికారిక గణాంకాలు ఆంధ్రప్రదేశ్పై అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నిధుల కొరత లేకుండా పీపీపీ నమూనాలో ఈ మౌలిక ప్రాజెక్టులు పట్టాలెక్కితే, రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్లో భారీగా ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపు లభించనుంది.

# విజన్ ఎడ్యుకేషన్ అడుగులు

హైదరాబాద్, ఆగస్టు 1, తెలంగాణ విద్యావ్యవస్థలో నూతన అధ్యాయాన్ని లిఖించబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థపై తన విజన్ ను ఆవిష్కరించారు. విద్యారంగ సమగ్ర స్వరూపాన్ని మార్చేందుకు తన వద్ద ఉన్న కార్యాచరణను స్పష్టంగా వివరించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా, రాబోయే తరాల భవిష్యత్తే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన నొక్కి చెప్పారు.గత పాలకులు ఇరిగేషన్ శాఖను తమ వద్ద ఉంచుకుని, వేల పుస్తకాలు చదివామని గొప్పలు చెప్పుకుంటూ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు రేవంత్ రెడ్డి. కానీ నేను మాత్రం ఓట్లు లేని, కేవలం బాధ్యత మాత్రమే ఉన్న విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని పరోక్షంగా విపక్షాలకు కౌంటర్ ఇచ్చారు. తానెలాంటి తప్పులు చేయలేదని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వివాదాల్లేకుండా పూర్తి చేశానని గుర్తుచేశారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, తెలంగాణ విద్యా వ్యవస్థ 28వ స్థానం నుండి 18వ స్థానానికి చేరుకుందని గణాంకాలతో సహా వెల్లడించారు.ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులు రూ.50 వేలకు మించి ఖర్చు చేయడం లేదని, కానీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు వెచ్చిస్తోందని సీఎం స్పష్టం చేశారు. బడ్జెట్లో విద్యకు 9 శాతం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, నాణ్యతా ప్రమాణాల్లో ప్రపంచంతో పోటీ పడటంలో మనం ఎక్కడో వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ పూర్తయినా కనీసం ఉద్యోగానికి దరఖాస్తు కూడా రాయలేని పరిస్థితి మారి తీరాలని ఉద్ఘాటించారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడమే కాకుండా, విదేశీ పర్యటనలకు ప్రతి ఏటా ఉపాధ్యాయులను పంపి గ్లోబల్ ఎడ్యుకేషన్ను ఇక్కడ అమలు చేస్తామన్నారు.తనకు ఎలాంటి ఇతర కోరికలు లేవని, 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో మీకేమీ అనుమానాలు అక్కర్లేదన్నారు. నల్గొండ వంటి ప్రాంతాల్లో 9 మంది ఉపాధ్యాయులున్నా ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలల పరిస్థితిని నిరసించారు. బదిలీలు చేస్తే ధర్నాలు చేయడం సరికాదన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి.. ట్రాన్స్ఫర్లు, ప్రమోషన్లు మీ ఇంటికే వస్తాయి. కానీ ఐదేళ్ల పాటు పిల్లల భవిష్యత్తు కోసం నా దారిలోకి వచ్చి పోరాడండి. మండలాల వారీగా క్లస్టర్లను ఏర్పాటు చేసి, పాఠశాలల అభివృద్ధికి మీరే నివేదికలు ఇవ్వండి, వాటిని అమలు చేసే బాధ్యత నాది" అని పిలుపునిచ్చారు.

# కొత్త బిజినెస్ లలో స్టార్ హీరోలు

హైదరాబాద్, ఆగస్టు 1, టాలీవుడ్ స్టార్ హీరోలు ఇప్పుడు సినిమాల్లో నటించడానికే పరిమితం కావడం లేదు. నిర్మాణం, పంపిణీతో పాటు థియేటర్ బిజినెస్‌లోనూ పెట్టుబడులు పెడుతున్నారు. ఒకప్పుడు ఈ రంగంలో నిర్మాతలు, ఎగ్జిబిటర్లే ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు స్టార్ హీరోలు కూడా తమ సొంత బ్రాండ్‌తో మల్టీప్లెక్స్‌లను ఏర్పాటు చేస్తూ ఎగ్జిబిషన్ రంగంలోకి అడుగుపెడుతున్నారు. ఈ జాబితాలో ముందుగా గుర్తొచ్చే పేరు మహేశ్ బాబుదే. హైదరాబాద్‌లోని ఏఎంబీ సినిమాస్ దేశంలోనే అత్యాధునిక మల్టీప్లెక్స్‌లలో ఒకటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత అల్లు అర్జున్ కూడా ఏఏఏ సినిమాస్తో ఈ రంగంలోకి అడుగుపెట్టారు. తాజాగా మాస్ మహారాజా రవితేజ కూడా థియేటర్ బిజినెస్‌లో పెట్టుబడులు పెట్టి తన ఉనికిని చాటుతున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి జూనియర్ ఎన్టీఆర్ కూడా చేరబోతున్నారనే ప్రచారం ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో అత్యాధునిక ప్రీమియం మల్టీప్లెక్స్ నిర్మించేందుకు తారక్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ వంటి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఐటీ ఉద్యోగులు, కుటుంబ ప్రేక్షకులు ఎక్కువగా ఉండటంతో అక్కడ ప్రీమియం మల్టీప్లెక్స్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. అందుకే తారక్ కూడా ఈ ప్రాంతాన్నే ఎంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమైతే.. మహేశ్ బాబు, అల్లు అర్జున్, రవితేజ తర్వాత థియేటర్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన మరో స్టార్ హీరోగా జూనియర్ ఎన్టీఆర్ నిలుస్తారు. అయితే ప్రస్తుతం ఇదంతా ఇండస్ట్రీ టాక్ మాత్రమే. తారక్ నుంచి లేదా ఆయన టీమ్ నుంచి అధికారిక ప్రకటన వస్తేనే ఈ ప్రచారంపై పూర్తి స్పష్టత రానుంది

# శారీరక దృఢత్వం పోలీసింగ్‌కు పునాది

**ప్రజాసేవలో ఉత్తమ ఫలితాలకు క్రమశిక్షణ తప్పనిసరి**

**అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి**

**వారాంతపు కవాతుకు హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి,**

మహబూబ్ నగర్ జిల్లా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా దృఢంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జానకి, సూచించారు.

శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు జిల్లా ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కవాతులో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు.

పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత అత్యంత అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయపాలన, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లు

వరంగల్, ఆగస్టు 1, తెలంగాణ రాష్ట్రంలో కొత్త పింఛన్ల పంపిణీని ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలనే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్నారు. ఈ పింఛన్లు ముఖ్యంగా తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితుల కోసం ప్రత్యేకంగా అందించబడనున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ శాఖపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వెల్లడించారు. ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు ఈ పింఛన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన బాధితులను గుర్తించి, వెంటనే పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వితంతు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులందరికీ కూడా పింఛన్లు మంజూరు చేయాలని సీఎం సూచించారు. దివ్యాంగులు చనిపోయినప్పుడు వారి భార్యలకు ఆలస్యం లేకుండా వెంటనే పింఛన్లు అందించాలనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. మండల స్థాయిలో అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ఎంపీడీవోలు బాధ్యత వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిషత్తు సమావేశాలను 45 రోజులకు ఒకసారి నిర్వహించాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని తెలిపారు. ఈ సమావేశాలు గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు సహాయపడతాయని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. పంచాయతీ కార్యాలయాలు గ్రామ జనాభా ఆధారంగా వర్గీకరించి నిర్మించాలనే ఆదేశాలు కూడా ఇచ్చారు. పారిశుధ్య పనులు, ఇతర అంశాలకు సంబంధించి కార్యదర్శులు పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలని సీఎం తెలిపారు. ఇందిరమ్మ చీరల పంపిణీకి సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో తాగు నీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ తాగు నీటి సరఫరా, హైదరాబాదు వాటర్ బోర్డ్, ఇరిగేషన్ అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించాలి. తాగు నీటికి ప్రాధమికత ఇవ్వాలని ఆయన తెలిపారు. గ్రామీణ తాగు నీటి పథకాల పరిధిలో పనిచేసే వారికి వేతనాలు కచ్చితంగా ఐదో తేదీలోపు అందించాలనే ఆదేశాలు ఇచ్చారు. కోటి మంది మహిళలకు పంపిణీ చేయాల్సిన ఇందిరమ్మ చీరలు ఆకట్టుకునే డిజైన్‌లో ఉండాలని, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిజైన్ల రూపకల్పనలో నిఫ్ట్ విద్యార్థులను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

# కమలం కొత్త వ్యూహం

హైదరాబాద్ ఆగస్టు 1, తెలంగాణాలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మార్చింది. కేంద్ర నాయకత్వం తలంటడంతో ఇప్పుడు తెలంగాణ కమలం పార్టీ నేతలు యాక్టివ్ అయ్యారు. సోషల్ మీడియాలో తెలంగాణ నాయకులు వెనకబడి ఉండటాన్ని కేంద్ర నాయకత్వంతో పాటు రాష్ట్ర పార్టీ ఇన్ ఛార్జులు కూడా తప్పుపట్టారు. డిజిటల్ యుగం నడుస్తున్న సమయంలో ఇలా వెనకబడి ఉంటే పార్టీ ఎలా ఎదుగుతుందని ప్రశ్నించారు. ఇకపై రీల్స్ చేయడం, మీమ్స్ వంటి వాటితో ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నించాలని, తెలంగాణలోని ప్రతి ఒక్క బీజేపీ నేతల సోషల్ మీడియాలో యాక్టివ్ కావాలని, వారి ఫాలోయిర్స్ సంఖ్య పెరగాలని ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ ప్రభుత్వం. ఇటీవల సోషల్ మీడియా వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించి ఎన్ని మిలియన్ల మందికి దగ్గరయిందో గుర్తుకు తెచ్చుకోవాలని రాష్ట్ర నేతలకు బీజేపీ కేంద్ర నాయకత్వం క్లాస్ పీకింది. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల విధానాలపై సోషల్ మీడియా వేదికగా బీజేపీ దూకుడు పెంచింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం, వ్యూహాత్మక పోస్టులతో ట్రెండింగ్ సృష్టించడం మరియు డిజిటల్ క్యాంపెయిన్ల ద్వారా కేడర్‌లో జోష్ నింపడం వంటి అంశాలపై ఆ పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది. ఇందుకోసం ప్రతి నేత సోషల్ మీడియాను హ్యాండిల్ చేసేందుకు సిబ్బందిని కూడా నియమించుకున్నారని తెలిసింది. తమ పర్యటనలతో పాటు ప్రభుత్వంపై విమర్శలు కూడా ఇందులో చోటు చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా వ్యూహాలతోనే అధికారంలోకి రాగలమని బీజేపీ కేంద్ర నాయకత్వం నమ్ముతుంది. దేశంలో, రాష్ట్రంలోసోషల్ మీడియా వినియోగం పెరిగిపోవడంతో దానిని అందిపుచ్చుకుని వెళితే తప్ప అధికారానికి దగ్గరకు కాలేమని పదే పదే చెప్పిన మాటలు కమలనాధులకు ఇప్పటికి చెవికి ఎక్కినట్లున్నాయి. ప్రభుత్వంపై విమర్శలతో పాటు కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పాలనా విధానాలను, నిర్ణయాలను నిరసిస్తూ నిరంతరం డిజిటల్ అస్త్రాలు [illegible] రాష్ట్ర ప్రభుత్వ హామీలు, ప్రజా సమస్యలపై ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తిస్తున్నారు. రాష్ట్ర నాయకులు సైతం ఆన్‌లైన్ చర్చల్లో పాల్గొంటూ కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. మొత్తం మీద తెలంగాణ బీజేపీలో పెద్ద మార్పు వచ్చినట్లుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం

కరీంనగర్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 40,380 క్యూసెక్కుల వరద చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు. ప్రస్తుత నీటిమట్టం 1071.20 అడుగులు. నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలు.. ప్రస్తుత నీటినిల్వ సామర్థ్యం 25.353టీఎంసీలు.

# మంత్రి విస్తరణ లేనట్టే...

హైదరాబాద్, ఆగస్టు 1, హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతలు సాగించిన మూడు రోజుల సుదీర్ఘ చర్చలు, ఏఐసీసీ సమన్వయ కమిటీ భేటీల తర్వాత తేలిందేమిటంటే.. ఎంతోమంది సీనియర్లు, ఎమ్మెల్యేలు ఆశగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రస్తుతానికి కోల్డ్ స్టోరేజీ లోకి వెళ్లిపోయింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా సీనియర్లంతా ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే, రాహుల్ గాంధీలతో పలు విడతలుగా సమావేశమైనప్పటికీ, కేబినెట్ విస్తరణ లేదా మార్పుచేర్పులకు మాత్రం అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో చాన్నాళ్లుగా మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది. ఈ నిర్ణయం వెనుక అధిష్ఠానం ఊరుకున్నంత ఉత్తమం.. బోడిగుండంత సుఖం అనే రక్షణాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీ లేదా రీషఫుల్ చేపడితే.. పార్టీలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతాయనే భయం అధిష్ఠానంలో ఉంది. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్‌లోనూ, పార్టీ అంతర్గత రాజకీయంలోనూ చోటుచేసుకున్న పరిణామాలు, అసంతృప్తుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణలో ఉన్న శాంతిభద్రతలను, ప్రభుత్వ స్థిరత్వాన్ని దెబ్బతీసే సాహసం ఇప్పుడు చేయకూడదని హైకమాండ్ ఒక స్పష్టమైన ముగింపునకు వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల పోటీ ఊహించని మలుపులు తిరుగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వంటి సీనియర్లు ఒకవైపు గట్టిగా ఒత్తిడి తెస్తుండగా.. జెన్-జీ నినాదంతో యువ ఎమ్మెల్యేలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలనే చర్చ సరికొత్త సమీకరణాలను తెచ్చిపెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి సైతం యువ ముఖాలకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనను తెరపైకి తెచ్చినట్లు వార్తలు రావడం, స్థానిక సంస్థల సమయానికి ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే వ్యూహాలు రేసును మరింత సంక్లిష్టంగా మార్చాయి. సీనియర్ వర్సెస్ జూనియర్, రెడ్డి వర్సెస్ బీసీ, ఎస్సీ సామాజిక సమీకరణాల మధ్య సమతుల్యత సాధించడం దాదాపు అసాధ్యంగా మారడంతోనే విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేశారు. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ పెద్దలు తెలంగాణ నేతలకు చాలా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పాలిటిక్స్ పక్కనపెట్టి, పాలనపై దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి వేగంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం మధ్య సయోధ్యను పెంచాలని ఆదేశించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని, మంత్రి పదవుల కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం కన్నా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆశావహులకు నర్మగర్భ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. హైకమాండ్ వ్యూహాన్ని గమనిస్తే.. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన వేళ, ఈ రకమైన అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు బయటపడితే అది కాంగ్రెస్ ఇమేజ్‌ను ప్రజల్లో దెబ్బతీస్తుందనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కేబినెట్‌ను కదిలించి తేనెతుట్టెను రేపడం కంటే ఉన్న వనరులతోనే పాలనను పరుగులు పెట్టించడం శ్రేయస్కరమని భావిస్తున్నారు. ఢిల్లీ పర్యటనతో ఏదో ఒక శుభవార్త వింటామని భావించిన ఆశావహులకు అధిష్ఠానం రివర్స్ షాక్ ఇచ్చిందనే చెప్పాలి. పదుల సంఖ్యలో ఉన్న మంత్రి పదవుల పోటీదారులకు చెక్ పెడుతూ, సర్కార్ గ్రాఫ్‌ను పెంచుకునే పనుల్లో నిమగ్నం కావాలని ఆదేశించడంతో.. తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రస్తుతానికి మళ్లీ మొదటికొచ్చినట్లే కనిపిస్తోంది


# తన్నీరు వర్సెస్ కల్వకుంట్ల

# చాపకింద నీరులా పోరు

మెదక్, ఆగస్టు 1, సిద్ధిపేట జిల్లాలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ లీడర్ తన్నీరు హరీశ్ రావు నిర్వహించిన పాదయాత్ర గులాబీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య చర్చకు తెరలేపింది. రైతాంగ సమస్యలు, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి విడుదల డిమాండ్‌తో హరీశ్ రావు చేపట్టిన ఈ యాత్రకు క్షేత్రస్థాయిలో ప్రజలు, రైతుల నుంచి విశేష స్పందన లభించింది. కేవలం నియోజకవర్గ లేదా జిల్లా స్థాయి నిరసనగా కాకుండా, ఒక బహుళ ప్రజా ఉద్యమంగా ఈ యాత్ర రూపాంతరం చెందడంతో రాష్ట్రవ్యాప్తంగా హరీశ్ రావు పాదయాత్ర చేపడితే పార్టీకి పూర్వవైభవం సాధించడం తేలికవుతుందనే అభిప్రాయాలు బీఆర్ఎస్ వర్గాల్లో బలపడుతున్నాయి. అయితే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌ను మళ్లీ అధికార దిశగా నడిపించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రస్థాయి యాత్రలు, సభల బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కేటీఆర్ నేతృత్వంలోనే కార్యక్రమాలు చేపట్టాలని హైకమాండ్ భావిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయి కేడర్ మాత్రం మాస్ కనెక్టివిటీ ఉన్న హరీశ్ రావు వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు కనిపిస్తోంది. పల్లెల్లో రైతులు, సామాన్య ప్రజలతో కలిసిపోయే నైజం, సుదీర్ఘమైన సంక్షోభ నిర్వహణ అనుభవం ఉన్న హరీశ్ రావు అయితేనే కాంగ్రెస్ వైఫల్యాలను జనంలోకి బలంగా తీసుకెళ్లగలరనే వాదన గులాబీ శ్రేణుల్లో విపరీతంగా పెరిగింది. ఈ భిన్నమైన అభిప్రాయాలు బీఆర్ఎస్ లోపల ఏమైనా అంతర్గత సంక్షోభాన్ని కాకపోయినా నాయకత్వ సవాలు గా చూడవచ్చు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచీ కేటీఆర్ గ్రామీణ, పట్టణ డిజిటల్ నెట్‌వర్కింగ్, నేషనల్ అప్పీల్‌తో కార్పొరేట్ లుక్‌ను ప్రతిబింబిస్తే, హరీశ్ రావు పక్కా తెలంగాణ మాస్, అగ్రికల్చర్, గ్రౌండ్-లెవల్ ఆర్గనైజేషనల్ పవర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా బిల్డప్‌ల కంటే భౌతికంగా జనంలో తిరిగే నాయకుడికే ఎక్కువ ఆదరణ ఉంటుంది కాబట్టి, సహజంగానే హరీశ్ రావు గ్రాఫ్ పార్టీ శ్రేణుల్లో పైచేయి సాధిస్తోంది. కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ప్రస్తుత వాతావరణంలో, పార్టీకి అధిపతి ఎవరు అనే దానిపై ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. కేటీఆర్‌ను తదుపరి వారసుడిగా ప్రాజెక్ట్ చేసే క్రమంలో హరీశ్ రావు పాత్రను కేవలం సిద్ధిపేట లేదా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధికే పరిమితం చేస్తున్నారనే అసంతృప్తి హరీశ్ మద్దతుదారుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు సిద్ధిపేట పాదయాత్ర సక్సెస్ కావడంతో.. హరీశ్ రావుకు రాష్ట్రస్థాయిలో స్వేచ్ఛనిస్తే కేటీఆర్ ప్రాబల్యం తగ్గుతుందనే ముందస్తు వ్యూహంతోనే ఆయనను మిగతా జిల్లాల్లో పాదయాత్రలకు అనుమతించడం లేదనే ఆరోపణలు విపక్షాల నుంచి రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి మార్క్ అగ్రెసివ్ రాజకీయాన్ని ఎదుర్కోవాలంటే కేవలం హైదరాబాద్ వేదికగా చేసే ప్రెస్ మీట్లు, ట్విట్టర్ వార్లతో సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు గుర్తించాయి. ఈ క్రమంలోనే ధర్నా చౌక్‌లు, ప్రాజెక్టుల సందర్శన, పొలాల బాట పట్టే విషయంలో హరీశ్ రావు చూపిస్తున్న చొరవను పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయి. ఈ పరిణామాలు బీఆర్ఎస్‌లో ప్రత్యక్ష చీలికకు దారితీయకపోయినా, అధికారికంగా పార్టీని నడిపిస్తున్న వర్గానికి, క్షేత్రస్థాయి బలమున్న హరీశ్ వర్గానికి మధ్య ఒక రకమైన సైలెంట్ పవర్ స్ట్రగుల్ నడుస్తోందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కేసీఆర్ స్పందించి కేటీఆర్, హరీశ్ రావుల మధ్య స్పష్టమైన బాధ్యతల విభజన చేయకపోతే ఈ నెరేటివ్ పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే అవకాశం ఉంది. ఒకరికి గ్రేటర్ హైదరాబాద్, అర్బన్ నియోజకవర్గాలు, మరొకరికి రూరల్ తెలంగాణ, రైతు పోరాటాల బాధ్యతలు అప్పగించాలన్న సూచనలు కూడా పార్టీ పెద్దలకు అందుతున్నాయి.

## నాగర్కర్నూల్ జిల్లాలో న్యాయవాది దారుణ హత్య

## కళ్లలో కారం చల్లి, వేటకొడవళ్లతో నరికి దారుణ హత్య



నాగర్ కర్నూలు నాగర్కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలో ఆర్ఎంపీ, న్యాయవాదిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న మల్లయ్య(55) తన క్లినిక్లో ఉండగా తమకు ఆరోగ్యం బాగాలేదని గుర్తుతెలియని ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు వచ్చారు. మల్లయ్య కళ్లల్లో కారం చల్లారు. తరువాత ప్రధాన రహదారిపైకి లాక్కొచ్చి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి చంపారు. దాడిలో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భూ తగాదాలే హత్యకు కారణమని అనుమానానిస్తున్నారు.

# క్యూర్ కు 28 శాతం మార్కులే

హైదరాబాద్ ఆగస్టు 1,70 ఏళ్ల చరిత్ర కలిగిన జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'క్యూర్' ముసాయిదా బిల్లు మహానగర పాలనా సంస్కరణల విషయంలో ఆశించిన స్థాయిలో లేదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా పని చేసే పాలనా అధ్యయన సంస్థ 'జనాగ్రహ' నిర్వహించిన సమీక్షలో ఈ ముసాయిదాకు కేవలం 28 శాతం మార్కులే లభించాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తీసుకొచ్చిన 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' (జీబీఏ చట్టం 2024) సాధించిన 38 శాతంతో పోలిస్తే.. హైదరాబాద్ కోసం ప్రతిపాదించిన ఈ బిల్లు సంస్కరణల పరంగా వెనుకబడి ఉందని సదరు అధ్యయనం ఎత్తిచూపింది.హైదరాబాద్ నగరాన్ని సమగ్రమైన ఏకైక అర్బన్ రీజియన్‌గా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఒక అధికారిక ఏకీకృత వ్యవస్థ లేకపోవడమే ఈ బిల్లులోని ప్రధాన లోపంగా విశ్లేషణ పేర్కొంది. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణం, మురుగునీటి పారుదల, భూ వినియోగం వంటి కీలకమైన బాధ్యతలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఎవరికి వారే స్వతంత్రంగా నిర్వహిస్తున్నాయని నివేదిక తెలిపింది. వేర్వేరు సంస్థల మధ్య అనుసంధానం లోపించడంతో నగర అభివృద్ధి ప్రణాళికలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయని స్పష్టం చేసింది.నగర పాలన సమర్థవంతంగా సాగాలంటే ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సమస్యలను తక్షణమే పరిష్కరించే అసలైన అధికారాలు ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా మేయర్, కౌన్సిల్‌ల అధికారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. నైబర్‌హుడ్ పరిధిలోని నిర్ణయాల్లో స్థానిక పౌరులకు భాగస్వామ్యం కల్పించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చాలని సూచించారు. నగర పరిపాలనా వ్యవస్థను నిరంతరం జవాబుదారీగా ఉంచేందుకు స్వతంత్ర పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ (ఎంపీసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎమ్‌డీఏ), ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే అత్యున్నత పాలనా మండలి విధుల మధ్య ఎలాంటి పునరావృతం లేకుండా స్పష్టమైన విభజన ఉండాలని పేర్కొన్నారు.బృహత్తర నగరాల నిర్వహణలో భారత దేశంలోనే హైదరాబాద్ ఒక మార్గదర్శక మహానగర పాలనా నమూనాగా ఎదిగేందుకు గొప్ప అవకాశం ఉందని జనాగ్రహ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ విశ్వనాథన్ అభిప్రాయ పడ్డారు. అత్యున్నత పాలనా మండలి సజావుగా పని చేసేందుకు ఒక పూర్తిస్థాయి సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే నగర ప్రాధాన్యతలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు హైదరాబాద్ వ్యవహారాల మంత్రి వంటి ప్రత్యేక రాజకీయ బాధ్యుడిని నియమించాలని ఆయన స్పష్టం చేశారు.

# మిడిల్ క్లాసు కష్టాలు...

హైదరాబాద్ ఆగస్టు 1, ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు. జాగ్రత్తగా ఉన్నంత మాత్రాన ఖర్చులు ఆగవు కదా.ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జీవించే మిడిల్ క్లాస్ వాళ్లకు ప్రతిరోజు ఒక పజిల్ మాదిరిగానే ఉంటుంది. అక్కడ జీవించే మిడిల్ క్లాస్ ప్రజల కష్టాల మీద ఒక వ్యక్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. ఈఎంఐ.. కిరాయిలు.. కుటుంబ ఖర్చులు.. వీటన్నింటికీ జీతం సరిపోక కనీసం మటన్ కూడా కొనుగోలు చేయడం కష్టమవుతుంది. జీవితంలో ఎటువంటి ఎదుగుదల లేకుండా.. పెళ్లి జరిగిన తర్వాత.. పిల్లలు పుట్టిన తర్వాత.. వారి బాధ్యతలతోనే జీవితం సంకనాకి పోతుందని.. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి చెప్పాడు. ఈ వీడియోను చాలామంది తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. తమది కూడా ఇటువంటి దుస్థితేనని వాపోతున్నారు. మా మనసులో ఉన్న బాధను మొత్తం వ్యక్తం చేశావని చాలామంది కామెంట్లు చేస్తున్నారు.గతంతో పోల్చి చూస్తే హైదరాబాద్ నగరంలో మిడిల్ క్లాస్ వల్ల కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. అన్ని ఖర్చులు పెరిగిపోవడం.. వాటికి తగ్గట్టుగా వేతనాలు పెరగపోవడంతో చాలామంది ఆర్థికంగా కష్టాలు పడుతూనే ఉన్నారు. పెళ్లి.. పిల్లలు.. బాధ్యతలు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తుంటాయి కాబట్టి.. చాలామంది కష్టాలను పంటి కింద భరిస్తూ.. తమ ఇబ్బందులను తిట్టుకుంటూ జీవితాన్ని సాగిస్తుంటారు. ఎందుకంటే అంతకుమించి చేయడానికి మిడిల్ క్లాస్ వాళ్లకు అవకాశం లేదు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో అవ్వాతాతల జీవితాల్లో భరోసా..

## నందిగామ 11వ వార్డులో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ: పేదల సంక్షేమమే ధ్యేయంగా, అవ్వాతాతలకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నందిగామ పట్టణం 11వ వార్డులో శనివారం ఉత్సాహంగా జరిగింది.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి వృద్ధులను ఆప్యాయంగా పలకరించి పెన్షన్లు అందజేశారు.టీటీడీ కల్యాణ మండపం సమీపంలో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.. పెన్షన్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వారి కుటుంబాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంధకారంగా ఉన్న సమయంలోనూ పేదల కష్టాలను అర్థం చేసుకుని, ఇంటి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్ అందిస్తూ పేదల కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపుతున్నారని తెలిపారు. ఒకటో తేదీ సెలవు రోజైతే అంతకుముందు రోజే పెన్షన్ అందించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.పేదల సంక్షేమం కోసం మాటల్లో కాకుండా చేతల్లో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం.. ప్రతి అవ్వాతాత గడపకు భరోసాను చేర్చే ప్రభుత్వమని తంగిరాల సౌమ్య గారు స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు, స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్టులో వీడియో వాల్ ను పరిశీలించిన ప్రధాని మోడీ

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్ భవనంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద వీడియో వాల్ ను ప్రధాని మోదీ పరిశీలించారు. వీడియో వాల్లో ప్రదర్శించిన వివిధ పుణ్యక్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర చారిత్రాక అంశాలను ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. విమానాశ్రయ ప్రాంగణంలోని వివిధ కళాకృతులను ప్రధాని ఆసక్తిగా పరిశీలించారు.

టెర్మినల్ ప్రాంగణంలో ప్రధాని మోదీతో గవర్నర్, సీఎం, డెప్యూటీ సీఎం, సీఎంఆర్ ప్రతినిధులు ఫోటోలు దిగారు. ఓపెన్ టాప్ జీపులో వెళ్తూ 13,500 మంది గిరిజన మహిళల థింసా నృత్యాన్ని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తదితరులు వీక్షించారు.

# ప్రియుడిపై మోజు భర్తనే చంపాలనుకుంది.,

చిత్తూరు ప్రియుడిపై మోజుతో భర్త, పిల్లలను వదిలేసి వివాహిత వేరే కాపురం పెట్టింది. మొదట భర్తను చంపాలనుకొని స్కెచ్ వేసి.. తర్వాత మనసు మార్చుకొని పారిపోయి ప్రియుడిని పెళ్లి చేసుకుంది. చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలం గుడికొత్తూరు గ్రామానికి చెందిన చిరంజీవికి శోభ(27) అనే మహిళతో 8 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నేపథ్యంలో రాంగ్ కాల్ ద్వారా శోభకు గుంటూరు జిల్లా కంద్రిగకు చెందిన బాలాజీ నాయక్(22) పరిచయమయ్యాడు. ఇన్స్టాగ్రామ్లో చాట్ ద్వారా మరింత స్నేహం పెరిగిఈ జంట ప్రేమలో పడింది. ఈ విషయం తెలిసి తన భర్త రోజూ కొడుతున్నాడని మొదట అతన్ని హత్య చేసి, ఆ తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకుందామని భార్య ప్లాన్ వేసింది. తర్వాత మనసు మార్చుకొని నెల రోజుల క్రితం పారిపోయి కుప్పంలో ఓ గుడిలో శోభ, బాలాజీ నాయక్ పెళ్లి చేసుకున్నారు.

భర్త తన భార్య శోభ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ క్రమంలో శోభ మరో యువకుడితో కలిసి బెగ్గిలిపల్లిలో ఉంటున్నట్టు గుర్తించి వారిని భర్త చిరంజీవి తరపు బంధువులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

శోభ తనను పెళ్లి చేసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందని, ఆమె బలవంతంతో పెళ్లి చేసుకున్నానని ప్రియుడు బాలాజీ నాయక్ తెలిపాడు. తన భర్త రోజూ అనుమానంతో వేధించి కొట్టేవాడని.. ఆ దెబ్బలు చూసి బాలాజీ నాయక్ తన భర్తను చంపుతానంటే వద్దని పారిపోయి వచ్చి పెళ్లి చేసుకున్నానని భార్య శోభ అంటోంది.

ఈ గొడవను పరిష్కరించలేక పోలీసులు తలలు పట్టుకున్నారు.

# చిత్తూరు జిల్లా నగరి మండలంలో కలకలం రేపిన ఘటన...

చిత్తూరు విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్ల తరబడి న్యాయ పోరాటం చేసిన ఓ కుటుంబంపై రౌడీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశాయన్న ఆరోపణలు తీవ్ర సంచలనంగా మారాయి. కోర్టు ఆదేశాలు ఉన్నా అమలు చేయలేదని... అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో విద్యుత్ శాఖ అధికారులపై, పోలీసుల వ్యవహారశైలిపై కూడా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గాయపడిన బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

చట్టం సామాన్యుడికి రక్షణ కల్పించేందుకా...? లేక బలవంతుల చేతిలో బలహీనులు బలైపోవడానికా...? అనే ప్రశ్నకు చిత్తూరు జిల్లా నగరి మండలంలో జరిగిన ఈ ఘటన అద్దం పడుతోంది.నగరి మండలం ఓజీ కుప్పం పంచాయతీలో నివసిస్తున్న ఆర్. వెంకటేశ్వర్, శాంతిలకు చెందిన తమ సొంత భూమికి విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.బాధితుల వాదన ప్రకారం... కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా, స్థానిక స్థాయిలో విద్యుత్ శాఖ అధికారులు వాటిని అమలు చేయకుండా ఆలస్యం చేశారని ఆరోపిస్తున్నారు.ఇదే సమయంలో... విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్న సమయంలో చందు, సుబ్రమణ్యం అనే వ్యక్తులు మరికొందరితో కలిసి తమ భూమిలోకి చొరబడి దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్, శాంతి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ ఘటన వెనుక భూ కబ్జాదారులకు కొందరు అధికారులు అండగా నిలుస్తున్నారంటూ బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈ కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాదు... స్థానిక పోలీసుల వ్యవహారంపై కూడా బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన వారు బాధితులకు న్యాయం చేయకుండా ఒత్తిళ్లు తెస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు.ఒక సాధారణ విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్ల తరబడి న్యాయపోరాటం చేయాల్సి రావడం... చివరకు దాడులకు గురై ఆస్పత్రి పాలవడం... ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.అయితే ఈ ఘటనపై బాధితులు చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారులు, పోలీసులు ఇప్పటివరకు అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నిజానిజాలు వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, బాధిత కుటుంబం ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# నిరుపేద మహిళకు లయన్స్ క్లబ్ చేయూత

## సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ డైరెక్టర్ లయన్ బాబూరావు
## -క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్




కమాన్ పూర్ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ నివసిస్తున్న కిరాయి ఇల్లు కూలిపోవడంతో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు జన్మదినాన్ని పురస్కరించుకుని, బాధిత మహిళకు నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ అంతర్జాతీయ డైరెక్టర్గా ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ల సేవా కార్యక్రమాలకు మార్గనిర్దేశం చేస్తూ సేవే పరమావధి అనే భావనతో లక్షలాది మంది లయన్స్ సభ్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వం, సేవా తపన, నిస్వార్థ అంకితభావం లయన్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సమాజ సేవే లయన్స్ ఉద్యమానికి మూల స్ఫూర్తి అని, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి టీవీ సురేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్లు మొల్మూరి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, క్లబ్ చైర్పర్సన్లు గంట వెంకటరమణ రెడ్డి, మర్రి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా నదికి వరదపోటు జూరాల గేట్లు ఎత్తివేత

మహబూబ్ నగర్ కృష్ణా నదికి వరద ప్రవాహం పోటెత్తింది. దాంతో జూరాల వద్ద 24 క్రస్ట్ గేట్లు ఎత్తివేసారు. జూరాల ప్రాజెక్టుకు 1.22 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో నమోదు అయింది. స్పిల్వే, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 1.31 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసారు. జూరాల విడుదల నీటితో శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతున్న 1.31 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో నీటి ప్రవాహం మరింత పెరగనుంది.

# జన సేవా సంఘ్ సభ్యుడు ఎస్.పి. సింగ్అంత్యక్రియలకురూ.1,25,000 ఆర్థికఆర్థిక సహాయం



హైద్రాబాద్ ఆగస్ట్ 1 ; జన సేవా సంఘ్ సీనియర్ సభ్యుడు ఎస్.పి. సింగ్ అంత్యక్రియలకు జన్ సేవా సంఘ్ ప్రతినిధి బృందం రూ.1,25,000 ఆర్థికఆర్థిక సహాయం అందించినట్లుజన సేవా సంఘ్ కోశాధికారి సుశీల్ శ్రీవాస్తవ తెలిపారు. సామాజిక సేవ మరియు మానవతావాదం పట్ల తమ నిబద్ధతకు అనుగుణంగా, జన సేవా సంఘ్ ఒక ప్రతినిధి బృందం ద్వారా, దర్భంగా జిల్లాలోని ఆయన స్వగ్రామంలో సీనియర్ సభ్యుడు మరియు కార్యనిర్వాహకుడు అయిన ఎస్.పి. సింగ్ అంత్యక్రియల కోసం సంస్థ నుంచి ఒక ప్రతినిధి బృందం అతని దర్భంగా గ్రామానికి వెళ్లి ఆర్థిక సహాయం అందించినట్లు ఆయన తెలిపారు..

ఈ తీవ్ర దుఃఖ సమయంలో, ఆ కుటుంబానికి సాంత్వన మరియు ధైర్యం అందించడానికి సంస్థ ఆర్థిక సహాయాన్ని అందించింది మరియు ఈ దుఃఖ సమయంలో శోకంలో ఉన్న ఆ కుటుంబానికి ఓర్పు మరియు బలం కలగాలని ప్రార్థిస్యాన్నట్లు సుశీల్ శ్రీవాస్తవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మానవ సేవయే గొప్ప మతం అని, అవసరమైన కుటుంబాలకు సాధ్యమైన అన్ని సహాయాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని సంస్థ అధికారులు పేర్కొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్--XII: బాల కార్మిక నిర్మూలన పోరాటంలో అద్భుతమైన పురోగతి

## (హెచ్.ప్రతాప్)

బాల కార్మిక వ్యవస్థ అనేది చట్టవిరుద్ధమైన చర్య మాత్రమే కాదు, ఒక చిన్నారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్తును హరిస్తున్న సామాజిక అన్యాయం. దేశ అభివృద్ధికి మానవ వనరులే పునాది అయితే, బాల్యాన్ని శ్రమకు బలి చేయడం ఆ పునాదిని బలహీనపరచడమే. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్--శఈఈ ఫలితాలు బాలల పరిరక్షణలో చట్ట అమలు సంస్థల నిబద్ధతకు నిదర్శనంగా నిలిచాయి.

జూలై నెలపాటు నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యాచరణలో 648 మంది బాల కార్మికులను రక్షించడం, 205 మంది యజమానులను అరెస్టు చేయడం, 209 క్రిమినల్ కేసులు నమోదు చేయడం సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. రక్షించబడిన చిన్నారుల్లో 386 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు కావడం, పేదరికం, వలసలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలు బాల కార్మిక వ్యవస్థతో ముడిపడి ఉన్నాయని సూచిస్తోంది. రోజుకు తొమ్మిది గంటలకు పైగా స్వల్ప వేతనాలతో ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న చిన్నారులను గుర్తించడం ఆందోళన కలిగించే విషయం.

నిర్మాణ ప్రదేశాలు, హోటళ్లు, వర్క్‌షాప్‌లు, గ్యారేజీలు, బేకరీలు, దుకాణాల్లో నిర్వహించిన విస్తృత తనిఖీలు, 54 బాలల సంరక్షణ సంస్థల పరిశీలన, 5,828 డిజిటల్ శోధనలు, 97 అవగాహన కార్యక్రమాలు ఈ ఆపరేషన్‌ను కేవలం దాడులకే పరిమితం కాకుండా సమగ్ర బాలల రక్షణ కార్యక్రమంగా నిలిపాయి. అలాగే గత రెండేళ్లలో నమోదైన గల్లంతు కేసులను సమీక్షించి 99 మంది అదృశ్యుల జాడ కనిపెట్టడం ప్రశంసనీయమైన విజయంగా చెప్పవచ్చు.

అయితే ఇటువంటి ప్రత్యేక కార్యక్రమాలు సంవత్సరానికి ఒకసారి నిర్వహించడం మాత్రమే సరిపోదు. బాల కార్మికులను నియమించే యజమానులపై కఠిన చర్యలు నిరంతరం కొనసాగాలి. పేద కుటుంబాలకు జీవనోపాధి, పిల్లలకు నాణ్యమైన విద్య, వలస కుటుంబాల పిల్లలపై ప్రత్యేక పర్యవేక్షణ, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపు అవసరం. ప్రతి పౌరుడు బాల కార్మికులను గమనించిన వెంటనే అధికారులకు సమాచారం అందించే బాధ్యతను స్వీకరించినప్పుడే ఈ దురాచారాన్ని సమూలంగా నిర్మూలించగలం. ప్రతి చిన్నారి చేతిలో పనిముట్టు కాదు, పుస్తకం ఉండే సమాజమే నిజమైన అభివృద్ధికి ప్రతీక.

# ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో మీడియా పాత్ర మరింత కీలకం

## నవతెలంగాణ 11వ వార్షికోత్సవం సభలో వక్తలు

హైదరాబాద్ ఆగస్ట్1: ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో మీడియా పాత్ర మరింత కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు.నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఘనంగా జరిగింది..ఈవార్షికోత్సవ సభకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, సిపిఐ ఎం ప్రధాన కార్యదర్శి జాన్ వేస్లీ, తమ్మినేని వీరభద్రం, ఎమ్మెల్యే కూనంనేని సాంబాశివరావు, సీజీఎం ప్రభాకర్, నవతెలంగాణ ఎడిటర్ రమేష్ , మెట్రో ఈవెనింగ్ ఎడిటర్ దేవరకొండ కాళిదాసు,ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ ఎడిటర్ మహేశుని లక్ష్మయ్య తో పాటు ప్రజాప్రతినిధులు, మేధావులు, పాత్రికేయులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు.






ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్తూ, కార్మికులు,

రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచి సమాజ చైతన్యాన్ని పెంపొందించడంలో నవతెలంగాణ విశిష్ట పాత్ర పోషిస్తోందని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ ఆకాంక్షల స్ఫూర్తితో ప్రారంభమైన నవతెలంగాణ నేటికీ ప్రజల పవ నిలిచి నిర్భయ జర్నలిజాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పత్రిక చేస్తున్న కృషిని అభినందించారు. నవతెలంగాణ మరింత బాధ్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# మోదీ,దళారీ,దోపిడి,పాలక వర్గాలకు వ్యతిరేకంగా విప్లవ ఐక్య ఉద్యమలను నిర్మిద్దాం

## సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు

హైద్రాబాద్ ఆగస్ట్ 1:మోదీ,దళారీ,దోపిడి,పాలక వర్గాలకు వ్యతిరేకంగా విప్లవ ఐక్య ఉద్యమలను నిర్మిద్దాం అని సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు నిచ్చారు.




సిపిఐ(ఎమ్ ఎల్)రామచంద్రన్ పార్టీ జాతీయ కమిటీ సమావేశం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ,పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్ అధ్యక్షతన నాగోల్ (హైదరాబాద్) నిర్వహించడం జరిగిందని ,పార్టీ అధికార ప్రతినిధి నకిరేకంటి చిట్టిబాబు ప్రకటించారు, ఈ సమావేశం లో పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ యావత్ ప్రపంచ ప్రఖ్యాత నక్సల్బరి ఉద్యమం దేశం తో పాటు విదేశాలను పేదల,కమ్యూనిస్టు ఉద్యమాలను ప్రభావితం చేస్తే, నేడు క్రియ శిల, విద్యార్థి,యువత, నిరుద్యోగం,అవినీతి,దళిత,మైనార్టీ, ఆదివాసి ప్రజలపై దాడులు,దేశ సంపద అంతా ,అదానీ, అంబానీ, చేతిలో పెట్టిన మోదీడఅమిత్ షా,కరుడు గట్టిన హిందూ వదులు,తీంం, అయోధ్య రామ్ మందిరంలో చెంద చోరీ చేసిన వారినందరినీ విద్యార్థి,యువత,12 ఏళ్ల హిందూ మతోన్మాద పాలనా ప్రభుత్వాలను ఢిల్లీ నాడి రోడ్లో మోకాళ్లపై కూర్చోబెట్టింది క్రియ శిల విద్యార్థి యువత, యువత సాధించిన విజయం చిన్న విషయం కాదని ,ప్రపంచ దేశాలు సైతం నివ్వెర పోయాయని , ఇది స్వతంత్ర భారతంలో సువర్ణ అవకాశం అని పేర్కొన్నారు ,బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను ,నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చిందని, ఈ కోడ్స్ అమలైతే 8 గా లకు,బదులుగా 12 గా లు పని చెయ్యవలసి వస్తుందన్నారు,కనీస వేతనాల హక్కు, ఉద్యోగ భద్రత,కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు బలహీన పడతాయని,వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి, గిట్టుబాటు ధర కల్పించాలి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాని మరింత బలోపేతం చెయ్యాలని కోరారు,కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలని డిమాండ్ చేశారు,ప్రజా సంక్షేమ పథకాలు ఆయన ఆశ,అంగన్వాడీ,ఐకేపీ, మద్యన భోజనం, మున్సిపల్, ఔట్ సోర్సింగ్,రంగాల్లో పని చేస్తున్న వర్కర్లకు కనీస వేతనం అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు, ఈ దిశగా గ్రామ స్థాయి నుండి, ఢిల్లీ వరకు విప్లవ ,ప్రగతిశీల, సంస్కృతి సంస్థలు,అంబేద్కర్ వదులు,అందరూ పీడిత ప్రజల హక్కుల కోసం ప్రత్యామ్నాయ శక్తులుగా ఏర్పడాలని ,ఆదిశగా రామచంద్రన్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు

# రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం

## అక్రమ పార్కింగ్ పై కఠిన చర్యలు

## తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ హెచ్చరిక

మహబూబాబాద్, తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) శంకర్ నాయక్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట ఉన్న భోజనశాలలు, హోటళ్లు, విశ్రాంతి కేంద్రాల వద్ద లారీలు, బస్సులు, ట్రాక్టర్లు తదితర భారీ వాహనాలను రాత్రి వేళల్లో నిర్లక్ష్యంగా నిలిపివేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారి పక్కన నిలిపిన వాహనాలకు వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, నిలుపుదల దీపాలు, హెచ్చరిక త్రిభుజ గుర్తులు లేకపోవడం వల్ల వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు. డ్రైవర్లు, వాహన యజమానులు తప్పని సరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం?1988, సెక్షన్ 122 ప్రకారం జాతీయ రహదారులపై అకారణంగా లేదా ఇతరులకు ప్రమాదం కలిగే విధంగా వాహనాలను నిలిపి వేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. అలాంటి వాహనాల ఛాయాచిత్రాలు, దృశ్యాల ఆధారంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాలు నిలిపివేయరాని ప్రాంతాల్లో వాహనాలను నిలిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాలను వదిలేయడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కఠిన చర్యలు తప్పవన్నారు. రవాణా శాఖ సూచనలు మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులు మినహా వాహనాలను నిలిపి వేయరాదు. వాహనాలను భోజనశాలలు, హోటళ్ల ముందు లేదా రహదారి అంచున ప్రమాదకరంగా నిలిపివేయరాదని, తప్పని సరిగా ఆపాల్సి వస్తే రహదారికి సురక్షితమైన దూరంలో మాత్రమే నిలిపివేయాలని, వాహనం వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, ప్రతిబింబించే పట్టీ, నిలుపుదల దీపాలు తప్పనిసరిగా ఉండాలి.రాత్రి సమయంలో ప్రతిబింబించే హెచ్చరిక త్రిభుజ గుర్తు ఏర్పాటు చేయాలని, వాహనాల సాంకేతిక సామర్థ్య ధ్రువీకరణ (ఫిట్‌నెస్), బ్రేకులు, టైర్లు, దీపాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలి.అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం పూర్తిగా నివారించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం ద్వారా ఒక ప్రకటన ద్వారా తెలపడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ రహదారులపై డీటీవో శంకర్ నాయక్ మాట్లాడుతూ, "మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి భద్రతే మా ప్రధాన లక్ష్యం. వాహన యజమానులు, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన

## ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణ చర్యలు

హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దాదాపు 80కి పైగా ఫోన్ కాల్స్‌కు స్వయంగా స్పందించారు. ప్రజలు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి, సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ సమస్యలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పెండింగ్ అభివృద్ధి పనుల పూర్తి, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన వేదికగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడం తన బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి సమస్యను బాధ్యతాయుతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు




## ఆపరేషన్ ముస్కాన్ చీఎఎ ద్వారా 125 మంది చిన్నారుల రక్షణ

### జిల్లా ఎస్పీస్నేహ మెహ్రా,



వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్నీ శాఖల సమన్వయం తో ఆపరేషన్ ముస్కాన్?చీఎఎ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, భిక్షాటన, విద్యకు దూరమైన చిన్నారులను గుర్తించి రక్షించేందుకు జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయంగా విస్తృత చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఎఖూ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గత నెల మొదటి నుండి 31-07-2026 వరకు జిల్లాలో మొత్తం 125 మంది చిన్నారులను రక్షించినట్లు తెలిపారు. వీరిలో 116 మంది బాలురు, 9 మంది బాలికలు ఉన్నారు. రక్షించబడిన చిన్నారుల్లో 97 మంది బాల కార్మికులు, 26 మంది చదువు మానేసిన (డ్రాప్ఔట్) చిన్నారులు, ఒకరు భిక్షాటనలో ఉన్న చిన్నారి, ఒక బాల్య వివాహాన్ని అడ్డుకుని సంబంధిత చిన్నారిని రక్షించినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 41 మంది చిన్నారులను కూడా గుర్తించి రక్షించినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్?చీఎఎలో భాగంగా ఇప్పటి వరకు 54 కేసులు (ఈఎఖీలు) నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే రక్షించిన చిన్నారుల్లో 89 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించగా, 36 మందిని బాలల సంరక్షణ గృహాలకు తరలించినట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఎఖూ మాట్లాడుతూ, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణా, భిక్షాటన, పిల్లలను చదువుకు దూరం చేసే చర్యలపై జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. చిన్నారుల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మికులు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్?100, చైల్డ్ హెల్ప్‌లైన్?1098కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్?చీఎఎను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి చిన్నారి సురక్షితమైన, విద్యతో కూడిన భవిష్యత్తు పొందేలా అన్ని శాఖలతో కలిసి కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు

## మహిళను మోసం చేసిన ఎస్సై అరెస్టు

హైదరాబాద్ తెలంగాణలో మహిళలను వేధిస్తున్న పోలీసుల జాబితలో మరో ఎస్సై పేరు చేరింది. మహిళలపై లైంగిక దాడి కేసులో ఎస్సై శ్రీకాంత్ అరెస్ట్ అయ్యాడు. సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని మహిళలను మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడి చేసినట్లు కేసు నమోదయింది. హైదరాబాద్ యువతి ఫిర్యాదుతో జగిత్యాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసారు. సాంకేతిక ఆధారాలతో నిజామాబాద్లో పోలీసులు నిందితుడిని గుర్తించారు. ఎస్సై శ్రీకాంత్ను అరెస్ట్ చేసి హనుమకొండకు తరలించారు. నిందితుడు సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎస్సైగా గుర్తించారు.



## పరుగెత్తండి.. ప్రాణాలు కాపాడండి

## అక్టోబరు 11న గ్రేస్ క్యాన్సర్ రన్

క్యాన్సర్ను ముందే గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్న సందేశంతో నిర్వహిస్తున్న గ్లోబల్ క్యాన్సర్ రన్-2026 తొమ్మిదో ఎడిషన్ ను ఘనంగా ప్రకటించారు. జూబ్లీహిల్స్ లో జరిగిన కార్యక్ర మంలో సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి నిధి అగర్వాల్ పాల్గొని రన్ అధికారిక టీ-షర్ట్, ఫినిషర్స్ మెడల్ను ఆవిష్కరించారు. అక్టోబరు 11న గచ్చిబౌలి స్టేడియంలో ఈ రన్ నిర్వహించనున్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీనియర్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. చిన్నబాబు సుంక వల్లి మాట్లాడుతూ ఈ రన్ ద్వారా సమీకరించే నిధులతో మొబైల్ స్క్రీనింగ్ వాహనాల ద్వారా లక్ష మంది పేదలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. టీ-షర్ట్ ఆవిష్కరణలో అనిల్ రావిపూడి, నిధి అగర్వాల్, డా. చిన్నబాబు సుంకవల్లి తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలి: హైకోర్టు



హైదరాబాద్ తెలంగాణ హైడ్రా శాంతాశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో హైకోర్టు తీర్పు వెలువరించింది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమన్న హైకోర్టు.. రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎస్‌కు సూచించింది. ఇందుకు టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉదహరించింది. చట్ట పాలన మాత్రమే కొనసాగాలని, వ్యక్తుల పాలన కాదని పేర్కొంది. వ్యక్తి ఆధిపత్యం పెరిగిందనేందుకు ఇదొక ఉదాహరణ అని అభిప్రాయపడింది.

## శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా.

బద్వేలు నియోజకవర్గంలో వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్య కలలను సాకారం చేసి, బద్వేలు పట్టణానికే తలమానికమైన శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటసుబ్బారెడ్డి శనివారం తెలిపారు.

శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల 1979 వ సంవత్సరంలో స్థాపించబడి విభిన్నమైన కోర్సులతో వేలాదిమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించింది. జాతీయస్థాయిలో అక్రిడియేషన్ గుర్తింపు పొంది, నేడు యు జి సి ద్వారా స్వయం ప్రతిపత్తి హోదా సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో ఎన్నోసార్లు ప్రథమ స్థానంలో నిలిచి ఉమ్మడి కడప జిల్లాలో నెంబర్ వన్ విద్యాసంస్థగా గుర్తింపు పొందింది శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల. కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించినందుకు శ్రీ బిజివేముల వీరారెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ కె. విజయమ్మ కళాశాల సెక్రటరీ శ్రీ కె. రితేష్ రెడ్డి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

## పాఠశాలల తనిఖీలో విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి

### కోతకోట, ముడుమాల, కె.సింగవరం పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ-1.



సి. బెలగల్, ఆగస్టు 1 సి. బెలగల్ మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాల పెంపు లక్ష్యంగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-1) శనివారం విస్తృతంగా పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీఎస్ కోతకోట (ఆర్), ఎస్‌పీఎల్ ముడుమాల (ఆర్), ఎస్‌పీఎల్ కె. సింగవరం పాఠశాలలను సందర్శించి అక్కడ అమలవుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న రెడినెస్ ప్రోగ్రామ్ అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెడినెస్ పుస్తకాలు, రికార్డులు, బోధనా ప్రణాళికలను తనిఖీ చేసి వాటి నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి చదవడం రాయడం నైపుణ్యాలను పరిశీలించారు. ఒక్కో విద్యార్థిని చదివించి, రాయించి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం బలోపేతానికి ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని ఎంఈఓ-1 సూచించారు. ప్రతి విద్యార్థి తన తరగతికి తగిన స్థాయిలో చదవడం, అర్థం చేసుకోవడం, రాయడం వంటి నైపుణ్యాలను సాధించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు. అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. అలాగే తరగతి గదుల్లో బోధనను మరింత ఆసక్తికరంగా నిర్వహిస్తూ విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. రెడినెస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యకలాపాన్ని నాణ్యతతో అమలు చేయడంతో పాటు సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యా నాణ్యత పెంపునకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల అభ్యాస ఫలితాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని ఎంఈఓ-1 పేర్కొన్నారు. పాఠశాలల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, విద్యా ప్రమాణాల పెంపు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు.

## మందుబాబులకు అడ్డాగాకొత్తపల్లి జంక్షన్




కరీంనగర్ ఆగస్టు01(కొత్తపల్లి జంక్షన్ ప్రాంతం రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం చీకటి పడిన వెంటనే కొందరు వ్యక్తులు జంక్షన్ వద్ద గుంపులుగా చేరి మద్యం సేవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మద్యం సేవించిన అనంతరం బీరు సీసాలను రోడ్డుపైనే పగులగొడుతూ, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా, రోడ్డుపై పగులగొట్టిన బీరు సీసాల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు బహిరంగంగానే మద్యం సేవించడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాల్సిన పోలీసులు, రైల్వే సిబ్బంది, రైల్వే పోలీసులు సైతం ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చీకటి పడిన తర్వాత కనీసం అటువైపు కూడా చూడటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# యువతా మేలుకో ! ఓటు డిజిటలైజేషన్ ప్రక్రియకు సహకరించండీ



**గండిపేట ప్రజాబలం ప్రతినిధి 1 ఆగస్టు 2016**జాతీయోద్యమముతో స్వరాజ్యం సాధించిన పిదప రాజ్యాంగ బద్ధమైన ప్రాథమిక ఓటు హక్కును కలిగి ఉండడం ప్రతి పౌరుడు బాద్యత. అట్టి ఓటును సద్వినియోగ పరుచు కోవాలంటే ముందు ఓటు డిజిటలైజేషన్ ప్రక్రియకు స్పందించి ఓటు హక్కును తప్పకుండా పొందాలని అన్యధా ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉన్నదని, అందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం డిజిటలైజేషన్ ప్రక్రియను మళ్లీ ఒకసారి ఆగస్టు10 వరకు పొడిగించడం సముచితమే కాగా ఇట్టి సదవకాశాన్ని ప్రత్యేకముగా యువత సద్వినియోగ పరుచు కోవాలని కొరడమైనధి. బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తలపెట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయ శిబిరంలో శనివారం రోజున ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఓటు ఎన్యుమరేషన్ ఫారం ఏ బి.ఎల్.ఓ వద్ద లభిస్తుంధో వివరాలు తెలియ పరచడం, 2002 లో వారి యొక్క లేదా వారి పరివారం సభ్యుల ఓటు వివరాలను తెలియజేస్తూ తద్వారా ఎన్యూమరెశన్ ధరకాస్తూ ఫారం పూరించి మ్యాపింగ్ చేయడంలో సంపూర్ణ సహకారన్ని అందించడం జరిగిందని మణికొండ, నెక్నంపూర్ డివిజన్ బి.ఆర్.ఎస్ నాయకులు గుట్టమీద నరేందర్, అందే లక్ష్మణ్ రావు, శైక్ ఆరీఫ్, భాను చందర్ తదితరులు తెలియ చేశారు.

# చదువుతోపాటు పిల్లలకు నైతిక విలువలూ నేర్పాలి

## ప్రతి ఉపాధ్యాయుడూ పిల్లల రక్షణకర్తగా బాధ్యత వహించాలి

## జిల్లా సెషన్స్ జడ్జి బాల భాస్కర్ రావు

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 1:** పిల్లలకు విద్యాబోధనతో పాటు నైతిక విలువలు, మంచి--చెడుల మధ్య తేడాను తెలియజేయడం ఉపాధ్యాయులతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయసేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్మన్ బాల భాస్కర్ రావు అన్నారు.

శనివారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా న్యాయసేవా సంస్థ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమితులైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా బాల భాస్కర్ రావు మాట్లాడుతూ, చట్టప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ బాలలేనని పేర్కొన్నారు. నేటి సమాజంలో పిల్లలు వివిధ రకాల వేధింపులు, సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి గురించి నిర్భయంగా మాట్లాడే ధైర్యాన్ని కల్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలతో మంచి--చెడుల గురించి తరచూ చర్చించాలని సూచించారు.

పిల్లల్లో పెరుగుతున్న సెల్‌ఫోన్, డిజిటల్ మీడియా వినియోగం, మాదకద్రవ్యాల ప్రభావంపై నిరంతరం నిఘా ఉంచి వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల రికార్డుల్లో ఒకరే చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఉన్నప్పటికీ, ప్రతి ఉపాధ్యాయుడూ పిల్లల రక్షణకర్తగా వ్యవహరించాలని సూచించారు.




తరగతి గదిలో శారీరకంగా ఉన్నా, మానసికంగా గైర్హాజరైన విద్యార్థులను గుర్తించి, వారి సమస్యలను అర్థం చేసుకుని అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని కోరారు. పాఠశాలల్లో పిల్లలపై ఎలాంటి వేధింపులు లేదా అసభ్యకర సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, పాఠశాల ప్రతిష్ఠ దెబ్బతింటుందనే ఉద్దేశంతో ఘటనలను దాచిపెట్టడం లేదా రాజీ చేయడానికి ప్రయత్నిస్తే ఉపాధ్యాయులు, యాజమాన్యాలు కూడా చట్టపరమైన చర్యలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఈ సదస్సులో పోక్సో చట్టం, జువైనల్ జస్టిస్ చట్టం, బాలకార్మిక నిషేధ చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు చట్టం (ఆర్‌టీఈ) వంటి కీలక చట్టాలపై నిపుణుల ద్వారా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. పిల్లలు దేశ సంపద అని, వారి సమగ్ర అభివృద్ధి, సురక్షిత భవిష్యత్తు కోసం విద్య, పోలీసు, రెవెన్యూ, న్యాయశాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, రాష్ట్ర న్యాయసేవా సంస్థల ద్వారా నిరుపేదలు, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు అందుతున్నాయని తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు బాలల రక్షణ చట్టాలపై పూర్తి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహించినట్లు చెప్పారు. న్యాయ నిపుణులు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆయా పాఠశాలల్లో ఇతర ఉపాధ్యాయులకు కూడా ఈ అవగాహనను విస్తరించాలని సూచించారు. పిల్లలకు మంచి మాత్రమే కాకుండా చెడు గురించి కూడా తెలియజేసి అప్రమత్తం చేయాలని, సంబంధిత శాఖల సమన్వయంతో బాలల స్నేహపూర్వక సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నయ్య, కూషాయిగూడ ఏసీపీ చక్రపాణి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక--యాజమాన్య వివాదాలకు సత్వర పరిష్కారం

## మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో కార్మిక సమస్యల పరిష్కారంలో సహాయ కార్మిక కమిషనర్ లక్ష్మీపతి విశేష సేవలు



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 1:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో పారిశ్రామిక శాంతి, కార్మికుల సంక్షేమం కోసం సహాయ కార్మిక కమిషనర్ లక్ష్మీపతివిశేషంగా కృషి చేస్తున్నారు. జిల్లాలోని వివిధ పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలలో ఉద్యోగులు--యాజమాన్యాల మధ్య తలెత్తిన 100కు పైగా కార్మిక వివాదాలను పరస్పర చర్చలు, సయోధ్య సమావేశాల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించారు.

కార్మికులు, యాజమాన్యాల మధ్య వేతనాలు, ఉద్యోగ నిబంధనలు, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ, బోనస్, ఉద్యోగాల తొలగింపులు, పని గంటలు తదితర అంశాలపై తలెత్తే వివాదాలను ఇరు పక్షాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, కార్మిక చట్టాలకు అనుగుణంగా చర్చలు నిర్వహించి పరస్పర అంగీకారంతో పరిష్కారానికి దారి చూపుతున్నారు. దీంతో కోర్టు వివాదాలు, సమ్మెలు, లాక్‌అవుట్లు వంటి పరిస్థితులను నివారించడంతో పాటు జిల్లాలో పారిశ్రామిక శాంతి నెలకొనేలా కీలక పాత్ర పోషిస్తున్నారు.

అదేవిధంగా కనీస వేతనాల చట్టం, దుకాణాలు మరియు వాణిజ్య సంస్థల చట్టం, గ్రాట్యుటీ చట్టం, ఉద్యోగుల పరిహార చట్టం, నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు తదితర కార్మిక చట్టాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. కార్మికులకు వారి హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు యాజమాన్యాలకు చట్టబద్ధమైన బాధ్యతలను వివరిస్తూ పారదర్శకమైన పారిశ్రామిక వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్నారు.

కార్మికులు తమ సమస్యలను నేరుగా సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో తెలియజేసే అవకాశం కల్పించడంతో పాటు, అందిన ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా ఉద్యోగుల హక్కులు పరిరక్షించబడటంతో పాటు యాజమాన్యాలు--ఉద్యోగుల మధ్య పరస్పర అవగాహన, విశ్వాసం పెరిగి జిల్లాలో పారిశ్రామిక సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయి. సహాయ కార్మిక కమిషనర్ లక్ష్మీపతి చేపడుతున్న ఈ చర్యలు కార్మిక సంక్షేమానికి, పారిశ్రామిక అభివృద్ధికి, శాంతియుత పారిశ్రామిక వాతావరణ నిర్మాణానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# సరస్వతి స్కూల్ లో విద్యార్థులకు మాక్ పోలింగ్.

## ఎన్నికల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు.

## స్కూల్ లీడర్ గా ఎన్నికైన పుప్పాల పవిత్ర నాథ్.

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు01 ప్రజాబలం:**మండల కేంద్రంలోని సరస్వతి (జీవి అకాడమీ) ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు మాకు పోలింగ్ ఎన్నికలు నిర్వహించారు, విద్యార్థులకు నోటిఫికేషన్, నామినేషన్, ఉపసంహరణ వంటి ఎన్నికల నియమాలను విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు నాయకులు ఎన్నికయితే పాఠశాలలో విద్యార్థులు ఎటువంటి ప్రసంగాలు చేయాలో, చర్చా వేదిక ఏర్పాటు చేశారు. ఎన్నికల పోటీ చేసే విద్యార్థులకు గుర్తుల కేటాయించి బాలెట్ నామ పత్రాలలో ఎన్నికలు ఎటువంటి అవాంతరాలు జరగకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు






ఈ ఎన్నికల సరళి పై గంట గంటకు ఫలితాలను తెలియజేస్తూ ఎన్నికల హడాహుడిని ప్రత్యక్షంగా విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఎన్నికలను బ్రాంచ్ అధికారి మమత, ప్రిన్సిపాల్ స్వరూప్ ఆధ్వర్యంలో పోలింగ్ నిర్వహణను పర్యవేక్షించారు. పాఠశాలలో సమర్థవంతంగా ఎలక్షన్ నిర్వహించినందుకు గాను పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు పాఠశాల నాయకుడిగా పుప్పాల పవిత్ర నాథ్ 77 ఓట్లతో ఘనవిజం సాధించాడు. అనంతరం ప్రతి తరగతి నుండి విద్యార్థులు తమ తమ క్లాస్ లీడర్ గా విద్యార్థులు ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బ్రాంచ్ అధికారి మమత, ప్రిన్సిపాల్ స్వరూప్, అంజిరెడ్డి, ప్రేమ్, రాజు, రాజ్ కుమార్, అంజలి, మాధవి రెడ్డి, మాధవి, అరుణ, కనకమ్మ, అనంత,ప్రసన్న, దివ్య, షాజీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లకు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆశీర్వాదం.



**ఖమ్మం జిల్లా ఆగస్టు01 ప్రజాబలం:**కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిశారు. శనివారం హైదరాబాదులోని గాంధీభవన్ లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ కు ఆయన పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సన్మానించి సత్కరించారు. టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియామకం కావడం పట్ల ఆయన అభినందించారు. రానున్న రోజుల్లో కూడా ఇంకా ఉన్నత పదవులను అధిరోహించాలని, రాష్ట్రంలో ఎస్సీ విభాగం బలోపేతం కోసం అహర్నిశలు శ్రమించాలని ఆయన సూచించినట్లు వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ధాన్యం బకాయిలపై బీజేపీ నిరసన..

# నేతల అరెస్టు

## సీఐపై డీఎస్పీకి ఫిర్యాదు



**వేములవాడ, ఆగస్టు 1 (ప్రజాబలం ప్రతినిధి):** రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో శనివారం వేములవాడలో భారీ ఆందోళన చేపట్టారు. చెక్కపల్లి బస్టాండ్ సమీపంలో నిర్వహించిన ధర్నాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై వరి ధాన్యాన్ని పోసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొంతసేపు ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



సమాచారం అందుకున్న పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ, జిల్లాలో వడ్ల కుంభకోణం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి రావాల్సిన ధాన్యం బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం శాంతియుతంగా చేపట్టిన ఆందోళనను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఆందోళన సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అస్వస్థతకు గురై కుప్పకూలడంతో పార్టీ నాయకులు వెంటనే ఆయనను వేములవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, నిరసన సందర్భంగా తమ కార్యకర్తలపై పోలీసులు అనవసరంగా బలప్రయోగం చేశారని ఆరోపిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆధ్వర్యంలో నాయకులు పట్టణ సీఐపై డీఎస్పీ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, వీడియో ఆధారాలను పరిశీలించి వాస్తవాలు నిర్ధారించిన అనంతరం చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

# యువకుడి అనుమానాస్పద మృతి

## మృతుడు ముదిమాణిక్యం గ్రామ వాసిగా గుర్తింపు

## కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 01 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండలపరిధిలోని ముదిమాణిక్యం , గ్రామానికి చెందిన, మల్లికార్జున పల్లి రాజు,(32) గుర్తించారు అనుమాన స్పద స్థితిలో ఎస్ ఇటిక్యాల, గ్రామ శివారులోని మృతి చెందిన ఘటన కలకలం రేపింది, రాజు మృతదేహం ఎస్, ఇటిక్యాల, గ్రామ





శివారులో లభ్యమయింది, విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పుల్కల్ ఎస్ఐ,ఎన్,విశ్వజన్, ఏఎస్ఐ వెంకటేశం జోగిపేట సిఐ అనిల్ కుమార్, సంఘటన స్థలానికి చేరుకొని బాడీకి పంచనామ చేసి, ఈ ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు, రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు,రాజు మృతి ఎలా జరిగింది, దీనికి గల కారణాలు ఏమిటనే కోణంలో అన్ని అంశాలను పరిశీలిస్తున్నట్టు, పోలీసులు తెలిపారు, మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడి కానున్నాయి .....

## గురుకుల పాఠశాలలో ఉచితంగా బోరు, వేయించి, మోటారు వేసి నీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యే అమిలినేని

## ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపిన పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు, విద్యార్థులు

అనంతపురం జిల్లా తిమ్మాపురం అంబెడ్కర్ గురుకుల పాఠశాలలో బోరులో నీళ్లు నిలిచిపోవడంతో 700 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని మీడియాలో వచ్చిన విషయం తెలిసి హుటాహుటిన నాయకులను, సిబ్బందిని పంపి తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా అందించేలా చర్యలు చేపట్టి అదే రోజున జియాలాజిస్ట్ ను పంపి రెండు పాయింట్లు పెట్టించగా మొదటి దాంట్లో నీళు పడకపోవడంతో రెండవది వేయగా పుష్కళంగా నీళ్లు పడ్డాయి, అంతే కాకుండా శ్రీరామిరెడ్డి నీళ్లు కూడా సక్రమంగా అందేలా చేయడంతో నేడు నీటి సమస్య తీరింది, ఇప్పటికే బోరులోకి మోటారు దించగా, పైపు లైన్ కోసం 150 పీవీసీ పైపులు కూడా రావడంతో వారం రోజుల్లోగా శాశ్వత నీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు..శ్రీరామిరెడ్డి ద్వారా ట్యాంకులకు అందిన నీటిని నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా కుళాయి ఆన్ చేసి ప్రారంభించారు..దీంతో అంబెడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు ఎమ్మెల్యే అమిలినేని గారికి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు..

# వరుణయాగ మహోత్సవాలు ఘనంగా ముగింపు

## పూర్ణాహుతి, 108 కలశాభిషేకాలతో వైభవంగా నిర్వహణ

**వేములవాడ, ఆగస్టు 1 (ప్రజాబలం ప్రతినిధి):** వేములవాడలోని శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, లోకకళ్యాణం చేకూరాలని సంకల్పిస్తూ నిర్వహించిన మూడు రోజుల వరుణయాగ మహోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి.



ప్రభుత్వ నిర్ణయం మేరకు, దేవాదాయ శాఖ ఆదేశాలనుసారం జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహించిన ఈ మహాయాగంలో ఋష్యశృంగ మహర్షి ప్రతిష్ఠ, దేవతా పూజలు, గౌరీ పూజ, వాస్తు హోమం, నవగ్రహ హోమం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం తదితర వైదిక కార్యక్రమాలను



అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన దేవత శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని కూడా నిర్వహించారు. చివరి రోజు మూలమంత్ర హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, 108 కలశాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి మహామంగళహారతి సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయ ఈఓ ఎల్. రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఈఓ జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

## సిరిపురం సంక్షేమ వసతి గృహం అధికారి తూల్జారామ్ గౌడ్, కి ఘనంగావీడ్కోలు సమావేశం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 1(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంఎస్సీ బాలుర వాసతి గృహము సీరిపురం హాస్టల్ సుంక్షేమధికారి తులజారామ్ గౌడ్ సీరిపురం వాసతి గృహం నుండి ఎస్సీబాలుర వాసతి గృహం మోమిణపేట భాదిలి పై వెళ్లుచునందున వారికీ ఘనంగ విడుకొలు సమవెళం నిర్వహించడం జరిగిందిసమవెశంలొ కొత్తగా వాచిన సంక్షేమ అధికారి శ్రీనివాస్ కు స్వాగతం పలికారు ఈ



సమావేశంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు హాస్టల్ సిబ్బంది హాస్టల్ విద్యార్థులు వసతి గృహ అధికారి తుల్జారాం గౌడ్ ని ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను నెమరు వేసుకొని విద్యార్థులు వారిపై ఉన్న అపరమైన ప్రేమ అను రాగం ఆప్యాయతలు బట్టి కన్నీటి ద్వారా ఆవేదన వ్యక్తపరుస్తూ మళ్లీ ఎప్పుడు వస్తావు సార్ అంటూ విద్యార్థులు ఆవేదనతో సమావేశంలో పాల్గొని వెళ్లే ముందు సంతోషం వ్యక్తపరిచి పంపించినట్టు తెలిపారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కొరత, పారిశుధ్య లోపాలు

## బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కొరత, పారిశుధ్య లోపాలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త, మురుగు నీరు, తెరిచి ఉన్న నీటి సంపు, బీర్ సీసాలు కనిపించడంతో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే వారంలోగా తామే స్వయంగా ఆసుపత్రిని శుభ్రం చేస్తామని బీఆర్ఎస్ నేత పొట్ట నరేందర్ యాదవ్ హెచ్చరించారు. శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, మురుగు నీరు, అపరిశుభ్ర వాతావరణం, పనిచేయని మరుగుదొడ్లు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో నీటి బోరు రెండేళ్లుగా పనిచేయడం లేదని, వాష్‌రూమ్‌లలో నీటి సౌకర్యం కూడా లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. హెల్త్ సెంటర్‌లోని నీటి సంపు తెరిచి ఉండి పురుగులతో నిండిపోవడంతో దోమలు వ్యాపించి డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, గడువు ముగియడానికి కేవలం మూడు నెలలు మాత్రమే మిగిలి ఉన్న మందులను రోగులకు అందిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బీర్ సీసాలు కనిపించడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శాఖ పనితీరు పూర్తిగా క్షీణించిందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులు... స్పందించకపోతే తమ స్వంత నిధులతో ఆసుపత్రిని శుభ్రం చేసి, బోరు వేయిస్తామని ప్రకటించారు.

# ఆగస్టు 10 వరకు ఎస్ ఐ ఆర్ గడువు...

## ప్రతి అర్హత గల ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండాలి:జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 01(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి**/ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును భారత ఎన్నికల సంఘం ఆగస్టు 10, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటన లో తెలిపారు,ఈ మేరకు ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని పేర్కొన్నారు,జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా తమ ఫారాలను సమర్పించాలని కోరారు,జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 78 శాతం పూర్తయిందని




తెలిపారు,ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆగస్టు 10 లోపు తమ ఫారాలను సంబంధిత బీఎల్‌వోలకు తప్పనిసరిగా సమర్పించాలని కోరారు,అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా ఆగస్టు 10 నాటికి పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు,సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17, 2026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని,అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు ఓటర్లు క్లెయిమ్స్,అభ్యంతరాలను సమర్పించవచ్చని తెలిపారు,స్వీకరించిన క్లెయిమ్స్, అభ్యంతరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు పరిష్కార ప్రక్రియ చేపట్టనున్నట్లు,అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని వెల్లడించారు,జిల్లాలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండాలన్నారు,బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

# బురదమయమైన రోడ్లకు తక్షణ మరమ్మతులు

## చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణా



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 01 ప్రజాబలం:**వైరా మున్సిపాలిటీ పరిధిలోని అంతర్గత రోడ్ల అభివృద్ధి, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో మరమ్మతులు జరుగుతున్న కూరగాయల మార్కెట్ రోడ్డు, వాసవి కళ్యాణ మండపం రోడ్డును ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఈ శ్రీమన్యాకు పలు సూచనలు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్లను ప్రాధాన్యత ఆధారంగా గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలోని అన్ని అంతర్గత రోడ్లను దశలవారీగా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రామచంద్రరావుకు సూచించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ, గత రెండు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో రోడ్లు బురదమయంగా మారి ప్రజలు తీవ్రఇబ్బందులుఎదుర్కొన్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి మరమ్మతు పనులు ప్రారంభించాలని ఆదేశించామని తెలిపారు. ప్రస్తుతం బురదగా మారిన రోడ్లపై ఎస్‌డస్ట్, కంకర వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు వెల్లడించారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాలన కొనసాగిస్తామని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు



**సత్తుపల్లి , ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 01:** విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత వేణు అన్నారు. శనివారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రభుత్వ, గురుకుల హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు దుప్పట్లు, పడక సామగ్రి, కాస్మెటిక్ కిట్లు, పాఠశాల విద్యా కానుక కింద అవసరమైన వస్తువులను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి హాస్టళ్ల నిర్వహణను మరింత బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మంపాటి కాంతారావు, మల్లెల్లి అనిల్, కాసిన శ్రీను, వంశీ, దాట్ల రాము, హాస్టల్ వార్డెన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్నేహం మానవత్వానికి జీవితానికి చిరస్థాయి బలమైన బంధం

## స్నేహ దినోత్సవ శుభాకాంక్షలు

## డాక్టర్ కాపా మురళి కృష్ణ



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు01 ప్రజాబలం:**స్నేహం అనేది జీవితాన్ని ఆనందమయం చేసే అమూల్యమైన అనుబంధమే కాకుండా సమాజంలో మానవీయ విలువలను పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే గొప్ప అరుదైన బంధం అని ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు ఆదివారం అంతర్జాతీయ స్నేహ దినోత్సవం ఆగస్టు ఫస్ట్ సందర్భంగా చిరుకాల మిత్రులకు విద్యార్థులకు మిత్రులకు శ్రేయోభిలాషులకు పట్టణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ నిజమైన స్నేహం కష్టకాలంలో తోడుగా నిలిచి మనిషికి ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందన్నారు స్నేహ బంధాలు కుటుంబాల మధ్య సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించి శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు విద్యార్థి దశలో ఏర్పడే నుంచి స్నేహలు వ్యక్తిత్వం వికాసానికి బలమైన పునాదిగా నిలుస్తాయని విద్యతో పాటు క్రమశిక్షణ పరస్పర గౌరవం సహకార భావనలు అలవర్చుకోవాలని సూచించారు నేటి డిజిటల్ యుగంలో ప్రత్యక్ష మానవ సంబంధాలు ఆప్యాయత పరస్పర ఆదరణ మరింత అవసరమని డాక్టర్ కాపమురళీకృష్ణ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ప్రేమ స్నేహం సేవాభావాన్ని జీవితంలో భాగంగా చేసుకుని సమాజ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ అంతర్జాతీయ స్నేహ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ప్రతి కుటుంబంలో ఆనందం ప్రతి స్నేహబంధం లో విశ్వాసం ప్రతి జీవితంలో విజయాలునిండాలని ఆకాంక్షించారు

# శ్రీ సంతోషిమాత దేవాలయ హుండీ లెక్కింపు

## భక్తుల కానుకల రూపంలో 63,450 ఆదాయం



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు1**జమ్మికుంట పట్టణంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చందరాజు, కోశాధికారి అయిత యుగేందర్ ఆదేశాలు మేరకు సోమవారం రోజున దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భక్తుల మరియు పురోహితుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. హుండీ లెక్కింపు అనంతరం కమిటీ సభ్యులు అయిత మోహన్ మాట్లాడుతూ తేది :11.1.2025 నుండి 1.8.2026 వరకు 63,450/- రూపాయలు భక్తుల కానుకల రూపంలో వచ్చాయని తెలిపారు. అదేవిధంగా స్థానిక ప్రజలు,భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు రేవూరి వసంత్ శర్మ, రేవూరి రతన్ శర్మ,రేవూరి సాగర్ శర్మ, అయిత మోహన్,ఇమ్మడి వెంకటేశ్వర్లు,మల్లన్న,అయిత మల్లికార్జున్, కొక్కుల రమేష్, యాద శ్రీధర్, భూపతి సంతోష్ మరియు స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాను అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి..

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలి**
**పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 01ప్రజాబలం:**ఖమ్మం జిల్లాలోని చెరువులు, సరస్సులు, నదీ తీర ప్రాంతాలు సహా ప్రకృతి సిద్ధమైన నీటి వనరులను ప్రజలను ఆకర్షించే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.




శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని చెరువులు, నీటి వనరుల వద్ద ప్రతిపాదించిన పర్యాటక అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాల కల్పన, అందుబాటు లో ఉన్న భూమి, వివిధ ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా కలకోట, చింతకాని, ముత్తారం, చిరుమర్రి, బయ్యారం, మాటూరు లేక్, వైరా, పాలేరు రిజర్వాయర్, మధిర రివర్ ఫ్రంట్, ఇనియాద్రమ్మ, జమలాపురం, మామనురు లేక్, నేలకొండపల్లి బౌద్ధ స్థూపం పర్యాటక అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం నీటి వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు.

జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించా లని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, టూరిజం ఎస్‌ఈ సరిత, జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, టీజీటిడీసీ, సీపీఎస్‌ఏ ప్రతినిధులు ఎన్. రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, స్మిత, హరికృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ సలావుద్దీన్, ఐ-క్యాడ్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com